నేపాల్‌లో అల్లర్లలో చిక్కుకున్న సుమారు 200 తెలుగు ప్రజలను మంత్రి నారా లోకేష్ సురక్షితంగా స్వస్థలాలకు తీసుకువచ్చారు. ప్రతి సవాలులో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ముందుండి ఆదుకోవడం మాకు గర్వాన్నిస్తుంది.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ




శనివారం 13.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 148 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




## ఇక అభివృద్ధి.. అన్‌స్టాపబుల్

- భావితరాల కోసమే విజన్
- సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా అమలు చేస్తున్నాం
- ప్రధాని మోదీ నేతృత్వంలో వికసిత భారత్
- వచ్చే మూడేళ్లలో అమరావతి ఇన్‌ఫ్రా - 2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి
- సాగునీటితో రాయలసీమలో కోస్తాను మించిన అభివృద్ధి
- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు - ఏ మాత్రం నష్టం లేదు
- టెక్నాలజీతో ఇంటెన్సివ్ కేర్ కాదు.. ఇంటిదగ్గరే హెల్త్ కేర్
- అమరావతిలో నిర్వహించిన వే 2 న్యూస్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ కల్పన చేయటంతో పాటు దాన్ని సుసాధ్యం చేసే దిశగా పనిచేయాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ తరాల కోసమే విజన్‌ను రూపొందించి అమలు చేస్తున్నామని.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇది తన బాధ్యత అని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో వికసిత భారత్-2047 అమలు చేస్తుంటే రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ సిద్ధం చేసి అమలు చేస్తున్నామని వెల్లడించారు. శరీరానికి పోషకాలు ఎంత అవసరమో సమాజానికి మంచి పాలసీల అవసరం అంతే ఉందని సీఎం అన్నారు. వచ్చే 22 ఏళ్లలో మన రాష్ట్రం ఎక్కడ ఉండాలన్న అంశాన్ని నిర్దేశించేందుకే విజన్ రూపొందించి అమలు చేస్తున్నట్టు వివరించారు. అమరావతిలో శుక్రవారం వే 2 న్యూస్ కాంక్లేవ్‌కు హాజరైన ముఖ్యమంత్రి వేర్వేరు అంశాలపై అభిప్రాయాలను వ్యక్తీకరించారు. వచ్చే దశాబ్ద కాలంలో ఏపీ ఎలా ఉండబోతోందన్న అంశాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..."రాష్ట్రంలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం. 25 ఏళ్ల క్రితం భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా మారింది. 2038 నాటికి భారత దేశం నెంబర్-1 అవుతుంది. ఇందులో తెలుగు వారి పాత్ర ప్రధానంగా ఉండాలని భావిస్తున్నాను. ఈ ఏడాది..గతేడాది డబుల్ డిజిట్ గ్రోత్ సాధించగలిగాం. 2028-29 నాటికి రూ. 29,29,402 కోట్ల మేర జీఎస్డీపీ సాధించగలం. 2029-2034 నాటికి రూ. 57,21,610 కోట్ల జీఎస్డీపీ సాధించేలా ప్రణాళికలు రూపొందించాం. దీన్ని సాధించే బాధ్యత ఎన్డీఏ కూటమి తీసుకుంటుంది. 2028-29 నాటికి తలసరి ఆదాయాన్ని రూ.5,42,985 సాధిస్తాం. 2029-2034 నాటికి తలసరి ఆదాయం రూ.10.55 లక్షల కోట్ల సాధించగలం. ఇదేమీ అసాధ్యం కాదు...నిర్దిష్టమైన ఆలోచనతోనే ప్రణాళికలు వేశాం. దీనికి సంకల్పంతో పాటు మెగా డ్రీమ్స్ ఉండాలి. విజన్ 2020 సాకారం అయ్యాక కూడా విజన్ డాక్యుమెంట్లపై ఇంకా అనుమానాలు సరికాదు. భారత్ లాంటి దేశాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా అమలు చేయాలి.

సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం చేస్తున్నాం... అభివృద్ధికి అదే తరహాలో నిధులిస్తున్నాం. రాజకీయాలు అవసరమే కానీ...సమాజం గురించే ఆలోచించాలి. రాజకీయాలే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి జరిగేది కాదు.. విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావు. సీఎంగా భావితరాల కోసం ఆలోచన చేయాలి. 1994లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నాను. ఇప్పుడు సంపద సృష్టిస్తున్నాం.. పేదలకు అందిస్తున్నాం. ప్రజలందరికీ ప్రయోజనం కలిగేలా మంచి పబ్లిక్ పాలసీలు తీసుకువచ్చాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**మూడేళ్లలో అమరావతి ఇన్‌ఫ్రా పనులు-2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి :** ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశ అభివృద్ధి అన్ స్టాపబుల్ అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో సంక్షోభాలు వస్తున్నాయని..

మిగతా 2లో...

## గ్లోబల్ స్థాయికి తెలుగు సినిమా



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు సినిమా ఇప్పుడు గ్లోబల్ సినిమాగా మారుతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఆయన శుక్రవారం నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్‌డీ క్యాంపస్ చూస్తుంటే మినీ ఇండియాను చూసినట్టు అనిపించింది. నాకు నటనలో శిక్షణ ఇచ్చిన గురువు సత్యానంద్ ఎన్ఎస్‌డీ గురించి తరచుగా చెప్పేవారు. కళలు లేని సమాజంలో హింస ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, కళా రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎన్ఎస్‌డీ క్యాంపస్ ఏర్పాటు చేసే ఆలోచన ఉందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చిస్తానని ఆయన తెలిపారు. యువ కళాకారులకు శిక్షణ ఇచ్చేందుకు, ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి సంస్థలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## తురకపాలెం మరణ కారణాలపై తేల్చండి..



- వారంలోగా నివేదిక అందజేయాలి
- అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం
- రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలపై సమగ్ర నివేదికను వారంలోగా అందజేయాలని ఉన్నతాధికారులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. తురకపాలెంలో సీనియర్ వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతూనే ఉండాలని సూచించారు. తురకపాలెంలో నమోదైన వరుస మరణాల గురించి జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో విఫలం చెందారన్నారు. ఎ.ఎన్.ఎం.లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లే సమయంలో జ్వరపీడితులు ఎక్కువగా ఉంటే ఆ సమాచారం జిల్లా అధికారుల ద్వారా రాష్ట్ర అధికారులకు వెంటనే అందే వ్యవస్థ (సర్వైలైన్స్) ను శాఖాపరంగా పటిష్టం చేయాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలు, స్థానికుల నుంచి సేకరించిన రక్త నమూనాలు, వాటి ఫలితాల గురించి రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్, ఇతర అధికారులు మంత్రి సత్యకుమార్ యాదవ్ కు వివరించారు.

**1501 మందికి 42 రకాల పరీక్షలు :** ' తురకపాలెంలో 2018 మంది 18 ఏళ్లు పైబడిన వారున్నారు.

- 2లో

## సమృద్ధిగా ఎరువుల నిల్వలు

- రైతులు ఆందోళన చెందవద్దు...
- రాష్ట్రంలో సమృద్ధిగా ఎరువులు నిల్వలు
- అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- వారం రోజుల్లో మరింత యూరియా రాష్ట్రానికి చేరుకోనుందని వెల్లడించిన మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఎరువులు ఎటువంటి కొరత లేకుండా అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. విజయవాడలోని క్యాంప్ ఆఫీస్ లో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం యూరియా, డీఎపి, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు సహా అన్నిరకాల ఎరువులు సరిపడా నిల్వలుగా ఉన్నాయని తెలిపారు. జిల్లా వారీగా ఎరువుల నిల్వలను పరిశీలిస్తూ, కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులతో ప్రతిరోజూ సమీక్షలు జరుగుతున్నాయని అన్నారు. మార్కెట్‌లో ఎరువుల కొరత లేకుండా, రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, ఒక్క రైతు కూడా ఇబ్బందులు పడకుండా చూడటమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే రైతుల సమస్యల పరిష్కారం మా మొదటి కర్తవ్యం అని మంత్రి స్పష్టం చేశారు. ఎరువుల కొరత పేరుతో రైతులను మోసం చేయాలనుకునే డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులు 24 గంటలు పనిచేస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలోని సహకార సంస్థలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ వ్యాపారుల వద్ద 82,054 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. వివిధ పోర్టుల నుండి మరియు తయారీ సంస్థల నుండి 29,236, మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలకు రవాణా దశలో ఉందన్నారు. 1,06,412 మెట్రిక్ టన్నుల యూరియా పలు పోర్టులు, తయారీ సంస్థల ద్వారా రాష్ట్రానికి సెప్టెంబర్ నెలాఖరుకు చేరుకుంటాయని అన్నారు. రైతుల అవసరాలను గుర్తించిన కేంద్రం గురువారం రాష్ట్రానికి మరో 24,894 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారని, ఈనెల 15 తేదీ నుండి 22వ తేదీ లోపు విశాఖపట్నం పోర్టుకు యూరియా చేరుకుంటుందని తెలిపారు. ఈ యూరియా నిల్వలతో కరీఫ్ సీజన్ కు సరిపడా యూరియా అందరికి లభిస్తుందని, రాష్ట్రంలో ఎక్కడా కూడా యూరయా కొరత అనే మాట వినిపించదన్నారు.

-2లో

## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం



**న్యూఢిల్లీ, (జర్నలిస్ట్ ఫైల్):** దేశ రాజధానిలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం అంగరంగ వైభవంగా ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకార వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపరాష్ట్రపతి పదవీ బాధ్యతలు స్వీకరించిన రాధాకృష్ణన్‌ను ప్రత్యక్షంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

"దేశ అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఒకదానికి మీరు చేరుకోవడం గర్వకారణం. మీ అనుభవం, సేవా దృక్పథం దేశానికి మరింత మేలు చేస్తుంది" అని సీఎం అభినందించారు.

రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్రపతి, ప్రధానమంత్రి సహా పలువురు గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం పలువురు జాతీయ నేతలు, విదేశీ ప్రతినిధులు కూడా రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## యాంకర్ హబ్‌గా తిరుపతి



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్):** తిరుపతిని యాంకర్ హబ్‌గా చేసి జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం, ప్రైవేట్ పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా శుక్రవారం తిరుపతిలోని తాజ్ హోటల్ లో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన రీజనల్ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్రంలో జరుగుతున్న పర్యాటక రంగ అభివృద్ధి, పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పన, నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక భూ కేటాయింపుల విధానం తదితర పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని, కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని, పర్యాటకంగా తిరుపతిలో ఉన్న అవకాశాలను వివరించారు. అదే విధంగా మంత్రి దుర్గేష్ తో పాటు పర్యాటక శాఖ ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాట లు కొత్త పెట్టుడుల ప్రతిపాదన, తిరుపతిని కొత్త ఎంఐసీఈ గమ్యస్థానంగా ప్రోత్సహించడం, కారవాన్ టూరిజం, హౌస్ బోట్లు, హోమ్ స్టే, అడ్వెంచర్ టూరిజం, ఎక్స్ పీరియన్స్ సెంటర్స్ తో టూర్ ప్యాకేజీల అనుసంధానం, టూరిజం కొత్త పాలసీపై సమ్మిట్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ ఇన్వెస్టర్స్ తో, హోమ్ స్టే ఆపరేటర్స్ తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. పర్యాటక రంగ ఉన్నతాధికారులు, ఇతర అధికారుల పనితీరును మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసించారు. పెట్టుబడిదారులకు సరైన మార్గదర్శకత్వం అందించేందుకు టూరిజం టీమ్ నిత్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు,

మిగతా 2లో...



## పోలీసు శాఖ స్నేహహస్తం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** నిత్య జీవితంలో తరచూ ఎదుర్కొనే చాలా సమస్యలను పరిష్కరిస్తామని స్నేహహస్తం చాస్తోంది పోలీసు శాఖ! ఒకప్పటిలా ఫిర్యాదు ఇవ్వాలంటే పోలీసుస్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. తమ ఫిర్యాదుపై చర్యలు తీసుకున్నారా? లేదా? తెలుసుకునేందుకు ఎఫ్ఐఆర్ కాపీ తీసుకునేందుకు గతంలోలా అనేక పాట్లు పడాల్సిన పరిస్థితి లేదు. చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు కావాల్సిన సేవలు పొందొచ్చు.

**మహిళలకు తోడుగా 'శక్తి' :** ఆపదలో చిక్కుకున్న మహిళలు శక్తి యాప్ ఓపెన్ చేసి ఎస్‌వోఎస్ మీటపై నొక్కితే 10 సెకన్ల నిడివిగల వీడియో, ఆడియో ఆటోమేటిక్‌గా

మిగతా 2లో...

## నేతన్నలకు ఆప్కో బకాయిల చెల్లింపు

- మొదటి విడతగా రూ.2 కోట్లపై పైగా చెల్లింపులు
- 7 డివిజన్లలో 84 సొసైటీల బ్యాంకు ఖాతాల్లో బకాయిల జమ
- మంత్రి సవిత ఆదేశాలతో బకాయిల చెల్లింపు
- త్వరలో మిగిలిన బకాయిలూ చెల్లిస్తాం : మంత్రి సవిత



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేతన్నలకు మేలు చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటూ వస్తోంది. తాజాగా చేనేతలకు మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఆప్కో ద్వారా నేతన్నలకు పడిన బకాయిల్లో 20 శాతం మేర చెల్లించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఈ మేరకు రూ.2,00,32,615.41లను ఆప్కో అధికారులు శుక్రవారం విడుదల చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేత పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చింది. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలు పెంచేలా జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చేనేత బజార్లు నిర్వహిస్తోంది. టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్, తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తోనూ ఒప్పందం చేసుకుంది. 93 వేల చేనేత కుటుంబాలుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 11,488 మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తోంది. 50 ఏళ్లు నిండిన 92,724 మంది చేనేతలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ అందజేస్తోంది. నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది.

మిగతా 2లో...

## సంపాదకీయం

# నది దాటే ప్రతి అడుగు ప్రాణాలకు సవాలు



78 సంవత్సరాలు స్వాతంత్ర్యం వచ్చినా, గజపతినగరం మండలంలోని మర్రివలస గ్రామస్తులు నిత్యావసరాలు, వైద్యం, విద్య కోసం చంపావతి నది దాటేటపుడు తమ ప్రాణాలను సవాలు చేయాల్సి వస్తోంది. నియోజకగ్ర కేంద్రానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

**వర్షాకాలంలో ప్రాణాపాయం :** ప్రతీ వర్షాకాలంలో నది ఉధృతంగా ప్రవహిస్తుంటే, చిన్నారులను పాఠశాలలకు, పెద్దవాళ్లను వైద్య సేవలకు పంపడానికి తల్లిదండ్రులు, పెద్దలు నదిలో అడుగులు పెట్టి, ప్రాణాల పణంగా పెట్టి గ్రామాన్ని దాటించాల్సి వస్తుంది. నిత్యవసర సరుకులు తాకాలంటే, వృద్ధులైనా, మహిళలైనా, ప్రతి ఒక్కరూ ఈ ప్రమాదకర పరిస్థితికి ఎదుర్కోవాల్సి ఉంది.

**అసౌకర్యాలు: గిరిజన గ్రామాల కష్టం :** రోడ్డు, వంతెన నిర్మాణం ఆలస్యమవ్వడం వల్ల కేవలం మర్రివలస మాత్రమే కాదు, సిగడం, రాయివలస, ఎర్రడ వలస గిరిజన గ్రామాల ప్రజల జీవనం కూడా ప్రభావితమవుతోంది. గత టిడిపి పాలనలో వంతెన నిర్మాణానికి 3.30 కోట్లు మంజూరు అయినప్పటికీ, నిధుల పెంపు, టెండర్ విధానం ఆలస్యం కావడంతో పనులు నెరవేర్చబడలేదు.

**ప్రజల ఆవేదన: ప్రభుత్వం ఏమి చేస్తున్నారు? :** "వంతెన నిర్మిస్తామని చెప్పిన మాటలు నీటి మూటలా మారిపోయాయి" అని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. చిన్నారులను పాఠశాలలకు, వృద్ధులను వైద్యంలో తీసుకు వెళ్ళే పరిస్థితి ఇలానే ఉంది.

ప్రభుత్వం ఎందుకు ఈ 8 కిలోమీటర్ల రోడ్డు మరియు వంతెన నిర్మాణం సమస్యను 78 ఏళ్లలో పరిష్కరించలేదు?

వంతెనకు మంజూరైన నిధులు ఎందుకు వ్యయం చేయబడలేక, టెండర్ ప్రక్రియలోనే ఆలస్యం అవుతోంది?

గిరిజన గ్రామాల ప్రజల ప్రాణాలు, విద్య, వైద్యం పై ప్రభుత్వ దృష్టి ఎందుకు ఉండడం లేదు?

**తక్షణ పరిష్కారం అవసరం :** ప్రజల ప్రాణాలు, విద్య, వైద్యం, నిత్య అవసరాలు ఇలావుండకూడదు. ప్రభుత్వం వంతెన, రోడ్డు నిర్మాణ పనులను తక్షణం ప్రారంభించాలి. లేకుంటే గ్రామస్తుల నిత్య జీవనం సంక్షోభంలో పడే పరిస్థితి కొనసాగుతుంది.

**- అజయ్ చంద్ర, ఎడిటర్, జర్నలిస్ట్ ఫైల్**

# సమృద్ధిగా ఎరువుల నిల్వలు



(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు నాయుడు చొరవ ఫలితమే ఈ కేటాయింపు అని అన్నారు. వైసీపీ హయాంలో ఎరువుల కొరత రైతుల ఆందోళనలు తప్పితే రైతు సంక్షేమాన్ని మరిచారని మండిపడ్డారు. రైతు కష్టాన్ని అర్థం చేసుకున్న ఏకైక నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. కేంద్రం సహకారానికి రాష్ట్ర ప్రజల తరఫున మంత్రి అచ్చెన్న కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇక అభివృద్ధి.. అన్‌స్టాపబుల్

(మొదటి పేజీ తరువాయి)

నేపాల్, బంగ్లాదేశ్, ఫ్రాన్స్ ఇలా చాలా దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు చూస్తున్నామని సీఎం వ్యాఖ్యానించారు. సుస్థిరతకు, నాయకత్వానికి మారుపేరు భారతదేశమేనని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా సంస్కరణలు ప్రారంభించి అన్ని ప్రాంతాలకు అభివృద్ధిని వికేంద్రీకరించామని అన్నారు. దీనిపై మాట్లాడుతూ.. "విశాఖ, అమరావతి, విజయవాడ, తిరుపతి వంటి నగరాల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం. సేవల రంగం ద్వారా ఎక్కువ గ్రోత్ సాధించేలా చర్యలు చేపడుతున్నాం. అమరావతిలో ప్రారంభించిన ప్రతి పని రాబోయే మూడేళ్లల్లో పూర్తి అవుతుంది. రూ. 50 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు పూర్తి అవుతాయి. ప్రధాని చేతుల మీదుగా ఇవి ప్రారంభం అవుతాయి. 2019లో గెలిచి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి అయ్యేది. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల డయాఫ్రం వాల్ దెబ్బతింది. అధికారంలోకి వచ్చాక పోలవరంపై దృష్టి పెట్టాం. 2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేస్తాం. కియా ఫ్యాక్టరీ కోసం గొల్లపల్లి రిజర్వాయరును ఒక్క ఏడాదిలో పూర్తి చేసి నీరిచ్చాం. హంద్రీ-నీవా ప్రాజెక్టు కాల్వల విస్తరణ పనులు కేవలం 100 రోజుల్లో పూర్తి చేసి నీరు ఇచ్చాం." అని సీఎం అన్నారు.

**అమరావతి అభివృద్ధి అక్కడితో ఆగదు :**

"అమరావతిలో మొత్తం ప్రైవేట్ భూములే. హైటెక్‌సిటి రాక ముందు హైదరాబాద్ లో ఎకరం రూ. 1 లక్ష ఉండేది... ఇప్పుడు రూ. 100 కోట్లకు చేరింది. పరిశ్రమలు, రహదారుల లాంటి అభివృద్ధి జరిగితే భూమి విలువ పెరుగుతుంది. అమరావతి రైతుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు. అమరావతి అభివృద్ధి నిరంతరం. అభివృద్ధిని కొంత మేరకే పరిమితం చేస్తే... అమరావతి ఓ చిన్న మున్సిపాల్టీగా మిగిలిపోతుంది. హైదరాబాద్ తరహాలో అమరావతి కూడా గుంటూరు-విజయవాడ-తెనాలి తదితర ప్రాంతాలు కలిసి మహానగరంగా రూపొందుతుంది. భూములిచ్చిన వారిని ఆదుకుంటాం. విస్తరణ విషయంలోనూ ఏ మాత్రం ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేస్తాం. ఇప్పుడు ఉండే భూమి ఇప్పటికే సరిపోతుంది. భవిష్యత్ అవసరాల మేరకు రైతులతో మాట్లాడి అమరావతిని అభివృద్ధి చేస్తాం. అమరావతిలో 2026 జనవరికి క్వాంటం వ్యాలీ అందుబాటులోకి వస్తుంది. ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్‌కు అవసరమైన అనుబంధ సంస్థలు పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. అలాగే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ విద్యా సంస్థలు కొన్ని ఉన్నాయి. మరికొన్ని రాబోతున్నాయి." అని ముఖ్యమంత్రి తెలిపారు.







**భూమి ఇస్తే మెడికల్ కాలేజీ కట్టినట్టేనా..? :**

మెడికల్ కళాశాలకు భూమి మాత్రమే ఇచ్చి నిర్మాణం పూర్తి అయినట్టుగా కొందరు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించిన సీఎం..పీపీపీ విధానంలో వీటిని నిర్మించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. కాలేజీలను ఎక్కడా ప్రైవేటుకు అప్పగించటం లేదని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ కాలేజీల విషయంలో నాడు నేను తీసుకున్న నిర్ణయాల వల్లే రైతు కూలీల పిల్లలు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు అయ్యారని అన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని..వైద్య విద్యార్థులకు, వైద్య సేవలకు ఇబ్బంది రాకుండా చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఒకటికి వందసార్లు ఆలోచన చేసే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. సంజీవని ద్వారా సాంకేతికతతో అందరికీ ఆరోగ్యాన్ని అందించేలా ప్రాజెక్టును అమలు చేస్తున్నామని అన్నారు. త్వరలోనే రాష్ట్రమంతటా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వైద్య చికిత్సలు ఇంటెన్సివ్ కేర్ లో కాకుండా ఇంటిదగ్గరే అందేలా సాంకేతికత తీసుకువస్తున్నామన్నారు. పోలవరం బనకచర్ల లింకుపై అడిగిన సీఎం ప్రశ్నకు సమాధానమిస్తూ .. గతంలో ట్యాంకర్లల్లో నీళ్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితి రాయలసీమలో ఉండేదని.. ఇప్పుడు హంద్రీనీవాతో నీళ్లు ఇచ్చాక పరిస్థితి మారిందని అన్నారు. నీళ్లు ఇచ్చిన తర్వాత గోదావరి జిల్లాలతో పోలిస్తే అనంతపురం జిల్లానే జీఎస్డీపీలో అగ్రస్థానంలో ఉందన్నారు. ఉద్యాన పంటల వల్లే ఇది సాధ్యమైందన్నారు. కేవలం సముద్రంలో వృధాగా పోయే జలాలను మాత్రమే బనకచర్లకు వినియోగించుకుంటామని స్పష్టం చేశారు. అలాగే పీ4 ద్వారా పేదరికం లేని సమాజంతో పాటు ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకే నిరంతరం శ్రమిస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# పోలీసు శాఖ స్నేహహస్తం

(మొదటి పేజీ తరువాయి)

రికార్డై ఘటనా స్థలం లొకేషన్ వివరాలతో సహా పోలీసు కంట్రోల్ రూమ్‌కు చేరిపోతుంది. నిమిషాల వ్యవధిలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటారు.

యాప్ సెట్టింగ్స్‌లోని "హ్యాండ్ గెశ్చర్" ఆప్షన్ ఆన్ చేసి పెట్టుకుంటే ఎస్‌వోఎస్ మీట నొక్కలేని పరిస్థితుల్లో ఉన్నా సరే ఫోన్ అటూ ఇటూ గట్టిగా ఊపినా (షేక్ ట్రిగ్గర్) చాలు వెంటనే పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారమంది రక్షణకు కదలివస్తారు.

సురక్ష ఉంటే చాలు

పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే సురక్ష యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. మీరిచ్చిన ఫిర్యాదుపై చర్యలు తీసుకున్నారా? లేదా? ప్రస్తుతం ఆ ఫిర్యాదు ఏ దశలో ఉందనే అంశాలు తెలుసుకోవచ్చు.

ఎఫ్ఐఆర్ ప్రతి కోసం స్టేషన్‌కు వెళ్లక్కర్లేదు. ఎఫ్ఐఆర్ నంబరు, స్టేషన్ వివరాలు నమోదు చేసి పొందొచ్చు.

పాత వాహనం కొనుగోలు చేయాలనుకున్నప్పుడు దానికి ఏదైనా నేరంతో సంబంధం ఉందా అనేది దాని నంబరు నమోదు చేస్తే తెలిసిపోతుంది.

ఇంటికి తాళమేసేసి రెండు మూడు రోజుల పాటు ఇంటిల్లిపాది ఎక్కడికైనా వెళ్లే సందర్భాల్లో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌లో ఇంటికి పోలీసు రక్షణ పొందొచ్చు. ఈ యాప్‌లో ఆ విభాగంలోకి వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటే స్థానిక పోలీసులు వచ్చి ఇంట్లో సీసీ కెమెరాలు బిగించి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానిస్తారు. మీరు పర్యటన ముగించుకుని తిరిగి ఇంటికొచ్చేంతవరకూ నిరంతర నిఘా, గస్తీ ఉంచుతారు.



సైబర్ నేరాల బారిన పడే సందర్భాల్లో ఈ యాప్‌లోని సైబర్ క్రైమ్ ఆప్షన్‌లోకి వెళ్తే నేరుగా టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చు.

వాహనాలపై ఉన్న ఈ-చలానాల వివరాలు దీని ద్వారా తెలుసుకోవొచ్చు. అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లైన డయల్ 100, డయల్ 112కు కాల్స్ చేసుకోవచ్చు.

పోలీసు వాలంటీరుగా సేవలందించేందుకూ వివరాలు నమోదు చేసుకోవచ్చు.

సురక్షిత ప్రయాణానికి భరోసా : మహిళలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఆటోలో, క్యాబ్‌లు లేదా ఇతర వాహనాల్లో ఒంటరిగా ప్రయాణించే సందర్భాల్లో సురక్షిత ప్రయాణం కోసం శక్తి యాప్‌లోని "సేఫ్ ట్రావెల్" విభాగాన్ని ఎంపిక చేసుకోవాలి. అందులో "న్యూ ట్రాక్ రిక్వెస్ట్"లోకి వెళ్లి బయల్దేరిన ప్రాంతం, గమ్యస్థానం వివరాలు, ఏ వాహనంలో వెళ్తున్నారు, దాని నంబర్ తదితర వివరాలు నమోదు చేయాలి. మహిళ ప్రయాణించే వాహనాన్ని, ఆ మార్గాన్ని పోలీసు కంట్రోల్‌రూమ్ నుంచి గమనిస్తారు. వేరే మార్గంలో వెళ్తుంటే వెంటనే స్థానిక పోలీసుల్ని అప్రమత్తం చేస్తారు.

**పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండానే - ఫిర్యాదు చేయొచ్చు**

అత్యవసర పరిస్థితుల్లో పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే మహిళలు శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. "గివ్ ఏ కంప్లైంట్" విభాగంలోకి వెళ్లి వివరాలు నమోదు చేస్తే పోలీసులే మిమ్మల్ని సంప్రదించి చర్యలు తీసుకుంటారు. వేధింపులు, గృహ హింస, అత్యాచారం, లైంగిక దాడులు, ఈవ్ టీజింగ్, పరువు హత్యలు, బలవంతపు వివాహాలు, బాల్య వివాహాలు, అపహరణలు, సైబర్ బుల్లీయింగ్, ఫొటో మార్ఫింగ్ తదితర అంశాలపై ఫిర్యాదు చేయొచ్చు.

**క్యూఆర్ కోడ్ స్కాన్ చెయ్యండి - పోలీసులకు ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి**

**శక్తి ద్వారా ఫ్యామిలీ కౌన్సెలింగ్**

కుటుంబ తగాదాలకు సంబంధించి ఫ్యామిలీ కౌన్సిలింగ్ పొందేందుకు కూడా ఈ యాప్ ద్వారా విన్నవించొచ్చు.

అదృశ్యమైన చిన్నారుల ఆచూకీ కనుగొనేందుకు వారి పేరు, వయసు, చివరిసారిగా చూసిన లొకేషన్, ఫోటో తదితర వివరాలు అప్‌లోడ్ చేస్తే పోలీసులు స్పందిస్తారు.

కుటుంబ సభ్యులు, మిత్రుల ఫోన్ నంబర్లు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. ఎస్‌వోఎస్ సందేశం పంపినా, సేఫ్ ట్రావెల్ ఆప్షన్ వినియోగించినా పోలీసులతో పాటు ఈ నంబర్లకూ సందేశం వెళ్తుంది.

బహిరంగ మద్యపానం, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, తదితర అంశాలపైనా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీసుస్టేషన్లు, అక్కడి ఎస్‌హెచ్‌వోల నంబర్లు, అత్యవసర నంబర్లు పొందవచ్చు.

## తురకపాలెం మరణ కారణాలపై తేల్చండి..

(మొదటి పేజీ తరువాయి)

వీరిలో 1,501 మంది స్థానికంగా ఉన్నారు. మిగిలినవారు లేరు. ఉన్న 1501 మందికి 42 రకాల పరీక్షలు చేశాం. 1,501లో 109 మంది జ్వర పీడితుల నుంచి వైద్య శిబిరాల ద్వారా రక్త నమూనాలు సేకరించాం. బ్లడ్ కల్చర్ పరీక్ష ద్వారా కేవలం 4% మందిలో 'మెలియోడోసిస్' ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఒకరు మరణించగా ముగ్గురు కోలుకున్నారు' అని మంత్రికి అధికారులు వివరించారు. మట్టి నమూనాల పరీక్షల ఫలితాలు ఇంకా అందాల్సి ఉందని వెల్లడించారు.

**కొలెస్ట్రాల్ సమస్య అధికంగా ఉంది! :** '1,501 మందిలో 7% మందికి మధుమేహం ఉంది. కిడ్నీకి సంబంధించిన ఆర్ఎఫ్ టి (రీనల్ ఫంక్షన్ టెస్టు) చేయగా 6% మందిలో యూరియా, సీరమ్ క్రియాటినిన్, లివర్ ఫంక్షన్ టెస్టు (బిలిరుబిన్) చేయగా... 10% మందిలో సమస్య ఉన్నట్లు తేలింది. లిపిడ్ ప్రొఫైల్ టెస్టు (కొలెస్ట్రాల్) లో దాదాపు 59% మందిలో తెల్లరక్తకణాల పరీక్షలో 13% మోతాదుకు మించి సమస్య ఉంది. ఏదో ఒక ఇన్ఫెక్షన్ (లింఫోసైటిస్) 14% మందిలో ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. ఎర్ర రక్తకణాల(ఆర్‌బిసి) సమస్య 22% మందిలో ఉంది. రక్తహీనత(ఎనీమియా) సమస్య దాదాపు 48% మందిలో ఉంది. వీరిలో 66% మంది మహిళలు ఉన్నారు' అని మంత్రికి అధికారులు వివరించారు.

**మరణాల నమోదు ఎప్పటికప్పుడు జరిగేలా యాప్‌లో ప్రత్యేక ఆప్షన్ :** 'తురకపాలెం ఘటన అనుభవంతో క్షేత్రస్థాయిలో ఉండే ఎ.ఎన్.ఎం.లు, ఆశాలు యాప్ లో ఏరోజుకారోజు సదరు గ్రామాల్లో సంభవించిన మరణాల గురించి నమోదుచేస్తారు. నిర్దిష్ట సంఖ్య కంటే మరణాల నమోదు ఎక్కువగా జరిగితే వెంటనే అలెర్ట్ మెసేజ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి అలాగే రాష్ట్ర అధికారులకు ఏకకాలంలో వచ్చేలా వ్యవస్థను పటిష్టం చేస్తున్నాం. దీనివల్ల సకాలంలో సంబంధిత ప్రాంతాల్లోని పరిస్థితులపై అప్రమత్తమై వెంటనే సత్వర చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది' అని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలపై సిఫార్సులతో ఇచ్చే నివేదికలో అక్కడ పర్యటించిన వైద్య బృందాల అభిప్రాయాలు, చేసిన సిఫార్సులు ఉండాలన్నారు. అలాగే మరణాలకు సంబంధించిన కేస్ షీట్ల నిశిత పరిశీలనలో గమనించిన పూర్తి వివరాల్ని నివేదికలో పొందుపర్చాలన్నారు.

**కొత్తరెడ్డిపాలెంలోని పరిస్థితులపైనా అధ్యయనం చేయాలి? :** తురకపాలెం మాదిరిగానే సమీపంలో ఉన్న కొత్తరెడ్డిపాలెం గ్రామస్తులకు కూడా పరీక్షలు చేయాలన్నారు. ఇక్కడి సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఇంచుమించు తురకపాలెం మాదిరిగానే ఉన్నాయని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంటు డాక్టర్ రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సుందరాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యాంకర్ హబ్‌గా తిరుపతి


(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు తగిన ప్రోత్సాహం అందిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఏడాది కాలంలోనే దాదాపు రూ. 12,000 కోట్లు పర్యాటక పెట్టుబడులు సాధించామంటే ఇన్వెస్టర్లలో ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం స్పష్టమవుతోందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఇది సామాన్యమైన విషయం కాదన్నారు. ఈ సందర్భంగా రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు పర్యాటక రంగంలో పెట్టుబడి పెట్టేందుకు పెట్టుబడులతో రండి అని పర్యాటక పెట్టుబడిదారులకు మంత్రి దుర్గేష్ ఆహ్వానం పలికారు. కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో టెంపుల్ టూరిజంకు ప్రఖ్యాతి గాంచిన తిరుపతి లాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించి ప్రసంగించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే విశాఖపట్నం, విజయవాడలో ఈ తరహా రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ లు నిర్వహించి స్థానికంగా పర్యాటక రంగంలో ఉన్న అవకాశాలను వెల్లడించామన్నారు. తద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను పెట్టుబడులకు ఆహ్వానించామన్నారు. ఇప్పటికే కొన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు గుర్తుచేశారు.

రాయలసీమలో ప్రత్యేకించి తిరుపతిలో టెంపుల్ టూరిజంతో పాటు స్థానికంగా ఉన్న ప్రకృతి సౌందర్య ప్రాంతాలను, వాటర్ ఫాల్స్, టైగర్ రిజర్వ్, పర్యాటకులను ఆకర్షిస్తోన్న వివిధ పర్యాటక ప్రదేశాలను, పురాతన కట్టడాలు, చారిత్రాత్మక కోటలకు విస్తృత ప్రచారం కల్పించి మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు. అంతేగాక వీటన్నింటిని కలిపి టూరిజం సర్క్యూట్ గా చేయాలన్నదే తమ ఉద్దేశమన్నారు. అందులో భాగంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో విశాఖపట్టణం, అరకువ్యాలీ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలో యాంకర్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. పీపీపీ విధానంలో చేపట్టే పర్యాటక అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.

ఒకరోజు తిరుపతి దర్శనానికి వచ్చే భక్తుడు.. యాత్రికుడుగా మారి రెండు మూడు రోజులు ఇక్కడే ఉండి సమీపంలోని ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రణాళిక రూపొందించామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. అందులో భాగంగా చంద్రగిరి పోర్ట్, శ్రీ వెంకటేశ్వర జువాలాజికల్ పార్క్, తలకోన జలపాతం, ఫ్లెమింగో ఫెస్టివల్ జరిగిన సూళ్లూరుపేట, నేలపట్టులోని పక్షుల విహార కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా పర్యాటక పురోగతితో పాటు ఉపాధి అవకాశాలను బలోపేతం చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. స్థానిక పర్యాటకులతో పాటు ఇతర ప్రాంత పర్యాటకులను ఆకర్షించే అంశంపై దృష్టిసారించామన్నారు.



గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పర్యాటక రంగం కుంటుపడటంతో ఏపీ నుండి ఇతర ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లేవారని, కూటమి ప్రభుత్వంలో ఇతర ప్రాంతాల నుండి పర్యాటకులు రాష్ట్రానికి వచ్చేలా చేస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఈ క్రమంలో పర్యాటకుల వసతికి అవసరమైన స్టార్ హోటళ్లు, రిసార్ట్ లు, కాటేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు.

తిరుపతిని వ్యూహాత్మక పర్యాటక ప్రదేశంగా ప్రభుత్వం భావిస్తుందన్నారు. తిరుపతి నుండి సమీప ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటక పెట్టుబడిదారులను ఆహ్వానించామన్నారు. అందులో భాగంగా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ద్వారా రూ. 3482 కోట్ల విలువైన హాస్పిటాలిటీ ప్రాజెక్టులకు కేబినెట్ లో ఆమోదం లభించిందన్నారు. తద్వారా హోటళ్లలో 2698 రూమ్ లు ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. అంతేగాక దాదాపు 11,645 మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఇప్పటిదాకా రాష్ట్ర పర్యాటక రంగంలో రూ. 10,280 కోట్ల పర్యాటక పెట్టుబడులు వచ్చాయన్నారు. తద్వారా 1466 రూమ్ లు ఏర్పాటు కానున్నాయన్నారు. వీటన్నింటిని గ్రౌండింగ్ చేస్తున్నామన్నారు.

తిరుపతి సమీపంలో అట్ మోస్పియర్, నోవాటెల్, మారియట్, ఒబెరాయ్, లెమన్ ట్రీ, మహేంద్ర తదితర సంస్థలు రిసార్ట్స్, హోటళ్లు నిర్మించేందుకు ఎంఓయూలు చేసుకున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. దుబాయ్ తరహాలో మీటింగ్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్ (మైస్) టూరిజంను అభివృద్ధి చేస్తున్నామన్నారు. తిరుపతిలో డెస్టినేషన్ వెడ్డింగ్ లు సైతం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంతో కలిసి పర్యాటకంగా కొన్ని కార్యక్రమాలు చేపట్టగలిగితే డెస్టినేషన్ వెడ్డింగ్ కు అవసరమైన కళ్యాణ మండపాలు, సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నామన్నారు.

సీఎం చంద్రబాబునాయుడు అన్నట్లుగా క్యారవాన్ టూరిజంకు విస్తృత స్పందన వస్తోందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఏపీలో క్యారవాన్ టూరిజం ఏర్పాటు చేయనున్నామన్నారు. తద్వారా పర్యాటకులకు వసతి సౌకర్యం కలుగుతుందన్నారు. రాయలసీమలోని శేషాచలం అడవుల్లో అడ్వెంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్ తదితర ప్రక్రియను ప్రవేశపెడితే బాగుంటుందని ఆలోచిస్తున్నామన్నారు. ఎర్రచందనం లభిస్తున్న ఈ ప్రాంతంలో ఎక్స్ పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా తర్వాత అత్యధిక అడవులున్న ప్రాంతంగా పేరుగాంచిన తిరుపతి అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. అటవీ శాఖతో ఈ విషయమై సమన్వయం చేసుకుంటామన్నారు. పర్యాటక అభివృద్ధి చేపట్టేందుకు ఇబ్బందులు లేకుండా పర్యాటక, అటవీ, దేవాదాయ, ఇరిగేషన్ శాఖలు సమన్వయం చేసుకునేలా సీఎం చంద్రబాబునాయుడు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు.

రాష్ట్రంలో 10,000 హోమ్ స్టేలు తీసుకొచ్చేందుకు హోమ్ స్టే పాలసీని తదుపరి కేబినెట్ లో ఆమోదింపజేస్తామన్నారు. పాలసీ మేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కేబినెట్‌లో ఆమోదం పొందిన అనంతరం పోర్టల్ ను రూపొందిస్తామన్నారు. కోనసీమలో మండువా లోగిళ్లలో ఉండేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. అదే తరహాలో తిరుపతిలో పాతకాలం నాటి ఇళ్లలో, పురాతన కట్టడాలలో హోమ్ స్టేలు ఏర్పాటు చేస్తామన్నారు. విదేశీ పర్యాటకులు హోమ్ స్టే లలో ఉండేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తారని తెలిపారు.

స్పష్టమైన ప్రతిపాదనలతో, ఆలోచనతో పర్యాటక అభివృద్ధి చేపట్టేందుకు ముందుకు వచ్చే ఇన్వెస్టర్లకు ప్రభుత్వం అవసరమైన భూమి, రాయితీలు, ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు త్వరితగతిన జారీ చేస్తామన్నారు. ఇన్వెస్టర్లపై భారం పడకుండా తక్కువ ఖర్చయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

గడిచిన ఐదేళ్ల కాలంలో పర్యాటక మంత్రి పర్యాటక అభివృద్ధి చేయలేకపోవడం వల్ల పర్యాటక రంగం కుంటుపడిందన్నారు. పర్యాటకాన్ని పట్టించుకోకపోవడం వల్ల రతనాలసీమగా ఉండాల్సిన రాయలసీమ ఎలా మారిందో చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పర్యాటక పెట్టుబడులు శూన్యమన్నారు. రుషికొండను మాత్రం రాజప్రాసాదంగా తీర్చిదిద్దారన్నారు.

కార్యక్రమంలో హోమ్ స్టే, పర్యాటక పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలను ఎండీ ఆమ్రపాలి కాట ఇన్వెస్టర్లకు వివరించారు.. స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, ల్యాండ్ కన్వర్షన్ చార్జీలు, క్వాలిటీ సర్టిఫికేషన్, పవర్ చార్జీలు, జీఎస్టీ తదితర అంశాలను వివరించారు.

ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాట, జిల్లా అధికార యంత్రాంగం, నరసింహ యాదవ్, సుగుణమ్మ, డా. పసుపులేటి హరిప్రసాద్, టూర్ ఆపరేటర్స్ అసోయేషన్ అధ్యక్షులు విజయ్ మోహన్, సీఐఐ దామోదర నాయుడు, ఔత్సాహిక ఇన్వెస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నలకు ఆప్కో బకాయిల చెల్లింపు

(మొదటి పేజీ తరువాయి)



ఆప్కోకు వస్త్రాలు విక్రయించే నేతన్నలకు అయిదు శాతం జీఎస్టీ మినహాయిస్తోంది. ప్రస్తుత ట్రెండ్ కు అనుగుణంగా రెడీమేడ్ దుస్తుల తయారీలో శిక్షణిస్తూ, ఉత్పత్తులను ఆప్కో, ఈ కామర్స్ ద్వారా విక్రయాలు చేస్తోంది. కేవలం 15 నెలల కాలంలో నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా, గౌరవప్రదమైన జీవనం సాగించేలా కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది.

**రూ.2 కోట్లకు పైగా బకాయిల చెల్లింపు :** రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి కార్యక్రమాలు చేపడుతూనే, ఆప్కో ద్వారా బకాయిలు కూడా చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 84 చేనేత సొసైటీల నుంచి ఆప్కో వస్త్రాలను కొనుగోలు చేస్తుంటుంది. నేతన్నల నుంచి కొనుగోలు చేసే వస్త్రాలను ఆప్కో షోరూమ్ లు, ఈ కామర్స్ ద్వారా విక్రయాలు చేస్తోంది. నేతన్నల నుంచి కొనుగోలు చేసిన వస్త్రాలకు సంబంధించి బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశాలు జారీచేశారు. తక్షణమే ఆప్కో ద్వారా నేతన్నలకు పడిన బకాయిలను చెల్లించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. మంత్రి ఆదేశాలకనుగుణంగా మొదటి విడతగా ఆప్కో అధికారులు రూ. 2,00,32,615.41లను శుక్రవారం విడుదల చేశారు. ఈ నిధులు ఆయా చేనేత సొసైటీల ఖాతాల్లో జమకానున్నాయి.

**మొదటి విడత బకాయిల చెల్లింపులు ఇలా... :** రాష్ట్రంలో ఏడు డివిజన్లలో 84 సొసైటీలు ఉన్నాయి. ఆ సొసైటీలకు మొదటి విడతగా రూ. 2,00,32,615.41ల బకాయిలు చెల్లించారు. శ్రీకాకుళం డివిజన్లలో ఉన్న నాలుగు సొసైటీలకు రూ. 7,57,142లు, విజయనగరం డివిజన్లలో ఉన్న ఏడు సొసైటీలకు రూ. 3,44,007ల బకాయిలు విడుదల చేశారు. రాజమండ్రి డివిజన్లో 27 సొసైటీలకు రూ. 61,07,690లు, విజయవాడ డివిజన్లో ఉన్న 21 సొసైటీలకు రూ. 48,29,780లు చెల్లించారు. తిరుపతి డివిజన్లో ఉన్న 17 సొసైటీలకు రూ. 36,64,628లు, కడప డివిజన్లో ఉన్న 5 డివిజన్లకు రూ. 40,30,894లు బకాయిలు విడుదల చేశారు. కర్నూలు డివిజన్ లో ఉన్న ఏడు సొసైటీలకు రూ. 2,98,472ల మొదటి విడత బకాయిలు చెల్లించారు.

**ఆప్కో బకాయిలన్నీ చెల్లిస్తాం :** నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వారి గౌరవ ప్రదమైన జీవనమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. చేనేతల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఆప్కో ద్వారా కొనుగోలు చేసే చేనేత వస్త్రాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బకాయిలను సైతం తక్షణమే చెల్లించాలని ఆదేశించాను. మొదటి విడతగా నేతన్నలకు ఆప్కో రూ. 2 కోట్లకు పైగా బకాయిలు చెల్లిస్తున్నాం. త్వరలోనే మిగిలిన బకాయిలు కూడా చెల్లిస్తాం.

# నేపాల్ సంక్షోభంలో లోకేష్ చొరవ




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు చేరవేయడంలో మంత్రి నారా లోకేష్ చూపిన చొరవను రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి ప్రశంసించారు.

"నేపాల్‌లో ఆందోళనకర పరిస్థితుల్లో చిక్కుకున్న వారిని బయటకు తేవడంలో లోకేష్ ప్రదర్శించిన నాయకత్వం అనిర్వచనీయం. ఏపీ సచివాలయం నుంచే సమన్వయం చేస్తూ, నేపాల్ రాయబార కార్యాలయం, కేంద్ర ప్రభుత్వంతో నిత్యం సంప్రదింపులు జరపడం వల్లే బాధితులు క్షేమంగా తమ స్వస్థలాలకు చేరుకోగలిగారు" అని ఆయన అన్నారు.

అనంతపురంలో సూపర్ సిక్స్ సభకు తప్పనిసరిగా హాజరు కావాల్సిన పరిస్థితుల్లోనూ, కష్టాల్లో ఉన్న తెలుగువారిని ఆదుకోవడానికి లోకేష్ ముందుండి కదలడమే స్ఫూర్తిదాయకమని తెలిపారు. బాధితులతో ప్రతి రెండు గంటలకోసారి ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పిన తీరు ప్రజల మనసుల్లో లోకేష్ స్థానాన్ని మరింత బలపరిచిందన్నారు.

సంక్షోభ సమయంలో లోకేష్ తీసుకున్న నిర్ణయాలు, చూపిన సమయోచిత స్పందన తెలుగు యువతకు ఆదర్శమని, సహచర మంత్రులందరికీ గర్వకారణమని బీసీ జనార్థన్ రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కూడా లోకేష్ పనితీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు.

"నేపాల్‌లో చిక్కుకున్న చివరి బాధితుడు కూడా సురక్షితంగా స్వస్థలానికి చేరుకునే వరకు కూటమి ప్రభుత్వం తన వంతు కృషి కొనసాగిస్తుందని" మంత్రి బీసీ జనార్థన్ రెడ్డిభరోసా ఇచ్చారు.

# బాలికల సంరక్షణపై రాష్ట్ర స్థాయి సదస్సు

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** బాలికల సంరక్షణ అంశంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జువైనల్ జస్టిస్ కమిటీ, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా రాష్ట్రస్థాయి సదస్సును ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు.


ఈ కార్యక్రమానికి హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా, ముంబై హైకోర్ట్ న్యాయమూర్తి రేవతి మోహితి ధరే ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. అలాగే జువైనల్ జస్టిస్ కమిటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ రవినాథ్ తిల్హారీ, సభ్యులు జస్టిస్ వి.సుజాత, జస్టిస్ డా. జ్యోతిర్మయి ప్రతాప్, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ చల్లా గుణరంజన్ పాల్గొంటారు.

ప్రతి సంవత్సరం సుప్రీంకోర్టు సూచనల మేరకు దేశవ్యాప్తంగా ఇలాంటి సదస్సులు జరుగుతున్నాయి. ఈసారి బాలికల సంరక్షణ అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సదస్సులో యూనిసెఫ్, స్త్రీ శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ, విద్య, ఆరోగ్య, పోలీసు, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారు. అన్ని జిల్లాల నుంచి ప్రధాన న్యాయమూర్తులు, పిల్లల సంరక్షణ న్యాయస్థానాల న్యాయమూర్తులు, పోక్సో కోర్టు న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు కూడా హాజరుకానున్నారు.

బాలికల సంరక్షణకు సంబంధించి ప్రస్తుత చట్టపరమైన హక్కులు, రక్షణ, ప్రభుత్వ పథకాలు, అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించనున్నారు. అలాగే బాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు సమర్థవంతమైన సూచనలు చేయనున్నట్లు జువైనల్ జస్టిస్ కమిటీ నోడల్ అధికారి వి. యస్. యస్. శ్రీనివాస్ శర్మ తెలిపారు.

# తోపుదుర్తి భాస్కర్ రెడ్డి కన్నుమూత



**రాప్తాడు (జర్నలిస్ట్ ఫైల్):** రాప్తాడు వైసీపీలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పార్టీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డి హఠాన్మరణం చెందారు. శుక్రవారం మధ్యాహ్నం పొలం పనులు చేయిస్తూ భాస్కర్ రెడ్డి ఆకస్మికంగా కళ్లు తిరిగి కింద పడిపోయారు. దీంతో ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే భాస్కర్ రెడ్డి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా తోపుదుర్తి భాస్కర్ రెడ్డి.. తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి బాబాయ్. గతంలో ఆయన కాంగ్రెస్ పార్టీలోనూ పని చేశారు. భాస్కర్ రెడ్డి మృతి విషయం తెలుసుకున్న వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భాస్కర్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని జగన్ ట్వీట్ చేశారు.

# నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి ప్రమాణం



**కాఠ్‌మాండూ:** నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ రాజీనామాతో ఏర్పడిన రాజకీయ అనిశ్చితికి తెరపడింది. తాత్కాలిక ప్రభుత్వ సారథిగా మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి ప్రమాణం చేశారు. అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ఆమెతో ప్రమాణం చేయించారు. నేపాల్ మాజీ ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించి రికార్డు సృష్టించిన కర్కి.. ఆ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగానూ ఆరుదైన ఘనత సాధించారు.

నేపాల్ రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం రాత్రి 9.30 గంటలకు ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. కొద్దిమంది మంత్రులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఆమె.. ఆ వెంటనే కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

దేశంలో సంక్షోభం వేళ ప్రధాన రాజకీయ పార్టీలు, జన్ జడ్ ఉద్యమకారులతో ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్, దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పలు దఫాల్లో చర్చలు జరిపారు. న్యాయనిపుణులు, సామాజిక వేత్తలు, ఇతర భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపిన పౌడెల్.. చివరకు తాత్కాలిక ప్రధానిగా కర్కిని ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది.

**ఎవరీ కర్కి..?**

సుశీలా కర్కి (72).. జూన్ 7, 1952లో విరాట్‌నగర్‌లో జన్మించారు. తొలుత ఉపాధ్యాయురాలిగా కెరీర్ ప్రారంభించి.. ఆ తర్వాత న్యాయవ్యవస్థలో అడుగుపెట్టారు. నిర్భయంగా, సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ అవినీతి మచ్చలేని వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారు. 2009లో సుప్రీంకోర్టులో అడుగుపెట్టి.. శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

2016లో నేపాల్ సుప్రీంకోర్టులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత రాజ్యాంగ మండలి సిఫార్సు మేరకు చీఫ్ జస్టిస్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టి.. నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు. తాజా ఉద్యమంలోనూ ఆమె కీలక పాత్ర పోషించారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో అభ్యసించిన కర్కి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోదీతో స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో కొత్త సారథిని ఎన్నుకునేందుకు జనరేషన్-జెడ్ ఉద్యమకారులు ప్రయత్నాలు చేశారు. రేసులో మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి సహా కాఠ్‌మాండూ మేయర్ బాలేంద్ర షా, విద్యుత్తు బోర్డు మాజీ సీఈవో కుల్మన్ ఘీషింగ్ పేర్లను పరిశీలించినప్పటికీ.. చివరకు మాజీ చీఫ్ జస్టిస్ వైపే మొగ్గు చూపారు.

# అంచెలంచెలుగా నీటి శుద్ధి

- స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు చర్యలు
- గంటగంటకు పర్యవేక్షిస్తున్నాం
- వాతావరణ మార్పులతో అప్రమత్తంగా ఉండాలి
- తక్కెళ్లపాడు వద్ద వాటర్ వర్క్స్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరానికి సరఫరా అయ్యే మంచినీటిని అంచెలంచెల పద్ధతితో శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నామని, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలకు కూడా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. తక్కెళ్లపాడు వద్ద వాటర్ వర్క్స్ ను శుక్రవారం ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మునిసిపల్ అధికారులతో నీటి శుద్ధిపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గుంటూరు నగరానికి సరఫరా అయ్యే మంచినీటి విషయంలో ఎంతో జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. తక్కెళ్లపాడు వద్ద వాటర్ వర్క్స్ ను గంట గంటకు పరిశీలిస్తున్నారని చెప్పారు. క్లోరినేషన్ విషయంలో అప్రమత్తం ఉంటున్నామన్నారు. బీఆర్ స్టేడియం, నెహ్రూనగర్ కు పంపింగ్ అ-య్యాక మరోసారి క్లోరినేషన్ చేస్తామని వెల్లడించారు. వీటిని 42 రిజర్వాయర్లకు పంపించాక మరోసారి పరిశీలిస్తామని తెలిపారు. అనంతరం గృహాలకు సరఫరా చేశాక సచివాలయ సిబ్బంది ద్వారా శాంపిల్స్ తీసుకుని మరోసారి పరీక్షిస్తామన్నారు. ఈ విధంగా మంచినీటి సరఫరా విషయంలో రాజీ లేకుండా పని చేస్తున్నామని వెల్లడించారు. శుద్ధమైన నీటిని అందించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నామని చెప్పారు.

# ఆయేషా మీరా తల్లిదండ్రులకు సీబీఐ కోర్టు నోటీసులు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆయేషా మీరా హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆయేషా తల్లిదండ్రులకు సీబీఐ కోర్టు నోటీసులు జారీ చేసింది. మీరా హత్య కేసు నిందితుడు సత్యంబాబుపై 376, 302 సెక్షన్లు నమోదు చేసింది. అయితే ఈ కేసుపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని నోటీసుల్లో పేర్కొంది. ఇక ఇదే కేసులో సత్యంబాబు ఇప్పటికే నిర్దోషిగా విడుదలయ్యారు. విచారణ ముగిసినట్టు సీబీఐ తుది నివేదిక సమర్పించింది. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19న తెలపాలని ఆయేషా తల్లిదండ్రులకు జారీ చేసిన నోటీసుల్లో సీబీఐ కోర్టు తెలిపింది.

కాగా 17 ఏళ్ల ఆయేషా మీరా 2007, డిసెంబర్ 27న విజయవాడ శివారు ఇబ్రహీంపట్నంలో దారుణ హత్యకు గురయ్యారు. తను ఉంటున్న హాస్టల్ బాత్రూంలో రక్తపుమడుగులో పడి ఉన్నారు. అప్పట్లో ఈ ఘటన సంచలనం రేపింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు... తొమ్మిది నెలల తర్వాత సత్యంబాబును అరెస్ట్ చేశారు. 2010లో దోషిగా నిర్ధారించారు. కానీ ఆధారాలు లేకపోవడంతో 2017లో సత్యంబాబును నిర్దోషిగా విడుదల య్యారు. అయితే ఇదే కేసుపై పలు పిల్‌లు దాఖలయ్యాయి. వీటితో పాటు ఆయేషా తల్లిదండ్రులు సైతం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును సీబీఐకు అప్పగించాలని కోరారు. దీంతో కేసును 2018లో న్యాయమూర్తి సీబీఐకి అప్పగించారు. అప్పటి నుంచి సీబీఐ అధికారులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో 260 మంది సాక్షులను విచారించారు. అప్పట్లో కేసు దర్యాప్తు చేసిన పోలీసులను, కాలేజీ హాస్టల్ విద్యార్థులను పిలిచి ప్రశ్నించారు. ఆయేషా అస్తికలను రీ పోస్టుమార్టం చేశారు. డీఎన్ఏ పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కేసు దర్యాప్తు ముగియడంతో కోర్టుకు నివేదిక సమర్పించారు. దీంతో ఆయేషా మీరా తల్లిదండ్రులకు సీబీఐ కోర్టు నోటీసులు జారీ చేసింది.

# మానవత సంస్థ ద్వారా క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** దీర్ఘకాలం వైద్య సేవలుపొందే క్షయ వ్యాధి గ్రస్తులకు ఇచ్చే మందులకు అనుగుణంగా, పౌష్టికాహారం ఎంతైనా అవసరమని ఆదిశగా మానవతా సంస్థ పౌష్టికాహారం పంపిణీ చేయడం అభినందనీయమని మండల తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో, క్షయ వ్యాధి గ్రస్తులకు, హెచ్ఐవి బాదితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మానవత సంస్థ చైర్మన్ కొలసాని రాంచంద్ అధ్యక్షత వహించగా,

తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతు మానవతా సంస్థ, చేపడుతున్న, సేవా కార్యక్రమాల, కార్యాచరణను ప్రశంశించారు. మానవత సభ్యుడిగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తానని, అప్పుడే, అధికారిగా వృత్తికి,సామాజిక సేవాభిలాషిగా ప్రవృత్తి కి, ఓసంతృప్తి లభిస్తుందనే భావన వ్యక్తం చేశారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతు క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ఉపయోగించే మందులకు అనుగుణమైన పౌష్టికాహారం మానవత స్వచ్ఛంద సంస్థ అందజేయడం అభినందనీయ మన్నారు. టిబి వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు టీబీ లక్షణాలను వివరించారు. తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం 60 మంది పేషెంట్లకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.ఎస్ రమాదేవి, సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకట్, కే ప్రసాద్, ఈఎల్వి అప్పారావు, మొవ్వ సత్యనారాయణ, కే కేశవరావు, గుత్తికొండ లక్ష్మీ కాంతారావు, సామ్రాజ్యలక్ష్మి, ఆలపాటి వెంకటరామయ్య, తదితర సభ్యులు పాల్గొన్నారు.

# తాడిపత్రిలో మళ్లీ హైటెన్షన్.. భారీగా పోలీసుల మోహరింపు



**తాడిపత్రి(జర్నలిస్ట్ ఫైల్):** తాడిపత్రిలో మళ్లీ హైటెన్షన్ నెలకొంది. కొన్ని నెలలుగా తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈవివాదం ఇప్పుడు మరింత ముదిరింది. దీంతో తాడిపత్రిలో హైటెన్షన్ కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి నిర్మాణంలో ఆక్రమణలు ఉన్నాయని నోటీసులు జారీ చేశారు. శుక్రవారం పెద్దారెడ్డి ఇంటిని కొలతలు వేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు.

అయితే పెద్దారెడ్డి ఇంటి వద్ద గతంలోనే మున్సిపల్ అధికారులు సర్వే నిర్వహించారు. తాజాగా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదేశాలతో అధికారులు సర్వే చేసేందుకు నోటీసులు ఇచ్చారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో వైసీపీ నేతల ఇళ్లు కూల్చివేస్తామని జేసీ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే పెద్దారెడ్డి ఇంటిని సర్వే చేస్తామని మున్సిపల్ అధికారులతో నోటీసులు ఇప్పించారని మండిపడుతున్నారు. దురుద్దేశంతోనే మరోసారి కూడా నోటీసులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాడిపత్రిలో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఈ మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. తాడిపత్రిలో జేసీ, పెద్దారెడ్డి ఇళ్ల వద్ద భారీగా మోహరించారు. శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని రెండు పార్టీల నేతలు, కార్యకర్తలకు హెచ్చరించారు.

# హోటల్‌లో లగేజీ, ఫోన్లు దగ్ధం



**నేపాల్ :** నేపాల్ లో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ అవినీతిపై యువత ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో అల్లర్లు చెలరేగాయి. యువతీ, యువకులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేశారు. కానీ ఈ ఆందోళనలు, నిరసనలు హింసకు దారి తీశాయి. పలువురు పౌరులు మృతి చెందారు. కొన్ని ప్రాంతాల్లో టూరిస్టులు బస చేసిన హోటళ్లకు సైతం నిప్పు పెట్టారు.

కానీ ఈ ఘటనలో భారతీయులు సైతం చిక్కుకున్నారు. ముఖ్యంగా తెలుగు ప్రజలు సైతం ఉన్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చర్యలు చేపట్టారు. నేపాల్‌లో చిక్కుకున్న భారతీయులు, తెలుగువాళ్లను స్వస్థలాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది వారి ఇళ్లకు చేరారు.

అయితే తాజాగా అందించిన సమాచారం మేరకు.. నంద్యాల జిల్లా డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి భార్య కోట్ల సుజాత, ఆయన కుమార్తె నివేదిత కూడా నేపాల్ చిక్కుకున్నట్లు తెలిసింది. అంతేకాదు వాళ్లు బస చేసిన హోటల్‌లో లగేజీ, ఫోన్లను నిరసనకారులు దగ్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం కోట్ల సుజాత, ఆమె కుమార్తె నివేదిత సహాయం కోసం ఎదురు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ ప్రభుత్వం స్పందించి సురక్షితంగా తమను స్వస్థలానికి చేర్చాలని కోరినట్లు సమాచారం. మరి కోట్ల సుజాతమ్మ చిక్కుకున్న ఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది

# జగన్ వస్తే మేమే తీసుకెళ్తాం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పీపీపీ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 17 కాలేజీలు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ విధానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుబడుతోంది. పీపీపీ విధానమంటే ప్రైవేటు పరం చేయడమేనంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి 17 కాలేజీలు తీసుకొచ్చామని, ఇప్పుడు వాటన్నింటిని సీఎం చంద్రబాబు నాయుడు ప్రైవేటు పరం చేస్తున్నారంటూ వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారు.

దీంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు స్ట్రాంగ్‌గా రియాక్ట్ అవుతున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తి చూపుతూ విమర్శలు కురిపిస్తున్నారు. మెడికల్ కాలేజీ విషయంలో వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై తాజాగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణం ఏ స్థాయిలో ఉందో చూడ్డానికి జగన్ వస్తారా? అని ఆమె ప్రశ్నించారు. జగన్ వస్తే తామే దగ్గర ఉండి తీసుకెళ్లి చూపిస్తామని చెప్పారు. . అంతేకానీ.. ప్రెస్‌మీట్ పెట్టి.. ఏదంటే అది మాట్లాడి బెంగళూరు వెళ్తామంటే ఎలా? అని హోంశాఖ మంత్రి అనిత నిలదీశారు.

# లిక్కర్ స్కామ్ కేసులో బిగ్ ట్విస్ట్..




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసు లో మరో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసీపీ ముఖ్య నేత నారాయణ స్వామి మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు పంపేందుకు ఏసీబీ కోర్టు అనుమతినిచ్చింది. తాజా పరిణామంతో నారాయణ స్వామి ఎవరెవరితో మాట్లాడారు.. కాల్ డేటాతో పాటు, బ్యాంక్ లావాదేవీలు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు సిట్ కేసు మరింత బలపడేందుకు సిట్ అధికారులకు కీలక సాక్షాధారాలు లభించనున్నాయి. అయితే, నిందితుడు నారాయణ స్వామి నాటి వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా సిట్ అధికారులు ఆయనను విచారించిన విషయం తెలిసిందే. తాజాగా నారాయణ స్వామి మొబైల్ ఫోన్‌ను ఏసీబీ కోర్టు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపనుండటంతో కీలక ఆధారాలు వెలుగు రానున్నట్లుగా తెలుస్తోంది.

# గుంతలో కడుతున్నారు..



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ రాజధాని అమరావతిపై మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజధాని అమరావతిని గుంతలో కడుతున్నారని, 30 ఏళ్ల పూర్తి అయినా అది పూర్తి కాదని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి నేతలకు అమరావతి ఏటీఎంలా మారిందని విమర్శించారు. పొలాలు ఇచ్చిన రైతులు మాత్రం లబోదిబోమంటున్నారని ఎద్దేవా చేశారు. రాజధాని కోసం లక్ష కోట్లు ఖర్చు పెడుతున్నారని, 500 ఎకరాల్లో సరిపోతుందని తెలిపారు. గుంటూరు- విజయవాడ మధ్య 500 ఎకరాల్లో రాజధాని నిర్మించాలని వైఎస్ జగన్ చెప్పారని తెలిపారు. కాదు కొండవీటి వాగులోనే రాజధాని కడతామంటే తమ ఇష్టమని చెప్పారు. తాము అధికారంలోకి రావడం ఖాయమని, మూడు రాజధానులపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

# ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం ప్రత్యేక కాల్‌సెంటర్

## ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సమస్యలు, సందేహాల నివృత్తి కోసం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యా లయంలో గురువారం టోల్‌ఫ్రీ కాల్ సెంటరు, హెల్ప్ డెస్క్ ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కాల్ సెంటర్ ఫోన్ నెం 1800599 5991ను ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈ కాల్ సెంటర్ ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటలవరకు పనిచేస్తుందని. ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించడంతోపాటు,వాటిని, పరిష్కరించడంలో చొరవ చూపడానికి ఈ కాల్ సెంటర్ను వినియోగించు కోవచ్చునన్నారు లబ్ధిదారుల ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు ఆధారంగా వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటారని నిర్ణీత గడువులోగా బిల్లులు జమ కాకపోవ డం, ఎక్కడైనా ఎవరైనా సిబ్బంది ఫోటోలను అప్ లోడ్ చేయడంలో ఆలస్యం చేయడం, ఇతర సాంకేతిక సమస్యలు, అవినీతి ఆరోపణలు తదితర అంశాలపై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటిని సంబంధిత అధికారుల వద్దకు తీసుకెళ్లి చర్యలు తీసుకుని లబ్ధిదారులకు కూడా ఆ వివరాలను తెలియచేస్తారని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో సారదర్శకతకు పెద్ద పీట వేస్తూ హార్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని, ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా మంచి ఫలితాలు సాదించామని, కృత్రిమ మేధను కూడా విరివిగా వాడుతున్నామని, ఈ కాల్ సెంటర్ ద్వారా లబ్ధిదా రులకు మరింత చేరువ అవుతున్నామని మంత్రి పేర్కొన్నారు. అవినీతికి ఎటువంటి ఆస్కారం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం 5 లక్షల రూపాయల సబ్సిడీతో పేదలకు ఇండ్ల నిర్మాణానికి సహాయం అందిస్తోందని తెలిపారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండి విపి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.




# కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

## కేస్ స్టడీగా సిగాచీ ఘటన

## రూ.20 లక్షలు ఖర్చయ్యే భద్రతపై కానరాని దృష్టి

## అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** అధికారులు కార్మికుల భద్రతపైనే ప్రధానంగా దృష్టి సారించాలని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అధికారులకు సూచించారు. గురువారం మర్రి చెన్నారెడ్డి మాన వనరుల కేంద్రంలో మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాశమైలా రంలోని సిగాచి పరిశ్రమలో సంభవించిన ప్రమాదాన్ని కేస్ స్టడీగా తీసుకోవాలని సూచించారు. ఈ ఘటనలో 53 మంది కార్మికులు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ యాజమాన్యం కేవలం రూ.20 లక్షల ఖర్చుతో అయ్యే సేఫ్టీకి సంబంధించిన రక్షణ చర్యలు తీసుకోకపోవడంతోనే ప్రమాదం సంభవించినట్టు చెప్పారు. కంపెనీలో సేఫ్టీ ఎన్విరాన్‌మెంట్ ఉన్నప్పుడే వర్కర్లు పని చేయగలుగుతారని అన్నారు. జీరో యాక్సిడెంట్ ఫ్యాక్టరీస్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. మేనేజ్‌మెంట్ వర్కర్స్ ఇన్షియేటివ్ కంటే సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే డిపార్ట్‌మెంట్ బద్నాం చేస్తారని అన్నారు. ఈనేపథ్యంలో పూర్తి స్థాయిలో సేఫ్టీ మీద దృష్టి పెట్టి మార్పులు వేయాలని అధికారులకు సూచించారు. పరిశ్రమల్లో భద్రతపై సంస్కరణలు తీసుకువద్దామని అన్నారు. ప్రతి నెలా వర్కర్లకు సేఫ్టీపై ఒక రోజు శిక్షణ ఇవ్వాలని సూచించారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు నీతిమాలిన చర్యలు మానుకోవాలి

## బిజెపి శాసనసభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు

**హైదరాబాద్, సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** కాంగ్రెస్, బిఆర్ఎస్ అవినీతి కుటుంబ పార్టీలను ప్రజలు అసహ్యించు కుంటున్నారని, ఈ రెండు పార్టీలకు తెలం గాణలో స్థానం లేదని, కాంగ్రెస్ బిఆర్ఎస్ లను భూస్థాపితం చేసే అవకాశం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, అందుకే కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు నీతి మాలిన చర్యలు మానుకోవాలని బిజెపి శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు అన్నారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రోత్సా హంతో బిఆర్ఎస్ అనధికారిక సోషల్ మీడియాలో తాను, పాయల్ శంకర్ మహేష్ కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నం చేస్తున్నారు ఇందుకోసం గోవ, ఢిల్లీలో రహస్య మంతనాలు చేస్తున్నారని తాము పత్రికా ప్రకటనలు విడుదల చేశామని తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు.

# కామారెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయండి

## మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన కృషిని తెలిపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్రంలోని బీసీలంతా సెప్టెంబర్ 15వ తేదీన కామారెడ్డికి లక్షలాదిగా తరలిరావాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించామని, అనంతరం బీసీలకు న్యాయం చేసేందుకు కృషి చేశామని గుర్తు చేశారు. గురువారం మంత్రుల నివాస సముదాయంలోని రాష్ట్ర రెవెన్యూ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో ఈ నెల 15 తేదీన కామారెడ్డి లో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి,
సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, శాసనసభ్యులు మదన్ మోహన్ రావు తదితరులతో మంత్రి సురేఖ సమావేశం అయ్యారు. కామారెడ్డి సభను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని... పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్టు చెప్పారు. దాంతోపాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు సభ నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అందుకే స్థానిక సంస్థల్లో 42 రిజర్వేషన్లను బీసీల కోసం కృషి చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ అడ్డుకుంటున్నాయని సమావేశంలో మంత్రులంతా సమిష్టిగా అభిప్రాయ పడ్డారు.
కామారెడ్డి వేదికగా ఇచ్చిన బీసీ కులగణన హామీని సాధించామని వివరించారు. ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభ చాలా ప్రతిష్ఠాత్మకమైందని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ఈ బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించడానికి అవలంబించాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించినట్టు వివరించారు.

# ఇందిరమ్మ ఇళ్ల విషయంలో తప్పుచేస్తే చర్యలు

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**బోథ్, సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** మండలంలోని రిసోర్స్ సెంటర్ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఇంటి లోపల డిజైన్, సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి మండలానికి ఒక మోడల్ హౌస్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం టిజిడబ్ల్యుఆర్‌జెసి రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కళాశాల (బాలికల)లో 4 కోట్ల 15 లక్షలతో నిర్మించిన డార్మెటరీ భవనాన్ని ఎక్సైజ్, పర్యాటకం, సంస్కృతి, పురావస్తు శాస్త్ర ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడుతూ కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని తెలిపారు. అంతకుముందు విద్యార్థులతో మాట్లాడుతూ, పాఠశాలలో మౌళిక వసతులతో పాటు మెనూ ప్రకారం భోజనం, విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు చూపిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక పరిచయ గార్డెన్ లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్ల మంజూరు పత్రాలను, మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ, నూతన రేషన్ కార్డులు పంపిణీ, చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎవరైనా లంచం అడిగిన ఇందిరమ్మ ఇళ్లకు సంబందించి డబ్బులు అడిగితే 9848014089 నెంబర్‌కు మేసేజ్ చేయాలని, ఆయా శాఖల లో వచ్చిన దరఖాస్తులు ఏ అధికారి దగ్గర పెండింగ్ ఉంచకుండా వారం, వక్షం రోజుల్లో పరిష్కరించాలని అన్నారు.
ప్రజాపాలనలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్ల మంజూరు పత్రాలు స్వయం సహకార సంఘాల లబ్ధిదారులకు అందజేశారు. మహిళా వికాస జిల్లా సమైక్య సంఘాలకు 41,91,96,267 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, శాసన సభ్యుడు అనిల్ జాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

# హరీశ్, సంతోష్‌లకు లైడిటెక్టర్ పరీక్ష ముందు చేయాలి

## తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్

**హైదరాబాద్, సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** లై డిటెక్టర్ టెస్ట్ మొదటగా హరీష్ రావు,సంతోష్ రావు కు చేస్తే అక్రమాలు అన్ని బయట పడుతాయని తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్ అన్నారు. గురువారం గాంధీ భవన్ ప్రెస్ మీట్ మాట్లాడుతూ కెటిఆర్ క్యాబినెట్ ఆమోదం లేకుండా 45 కోట్లు వేరే అకౌంట్ కి తరలించారని ఆరోపించారు. మంత్రిగా పని చేసిన కెటిఆర్‌కు తెల్వాదా విచారణ సంస్థలు నీ దగ్గరకు వస్తాయా? లేక నువ్వు వెళ్లి హాజరవ్వాలా? అని ఆయన ప్రశ్నించారు.ఎంక్వైరీకి రాను చేయను అంటే ఎవరు రావాలో వాళ్ళు వచ్చి వాళ్ల పని చేసుకుంటూ వెళ్తారని హెచ్చరించారు. కెటిఆర్.. ముందు కవిత వ్యాఖ్యలకు సమాధానం ఇవ్వు అని సలహా ఇచ్చారు. కెటిఆర్ ముందుభక్వాస్ మాటలు బంద్ చెయ్ అన్నారు. కెటిఆర్ సవాల్ విసురుతారు విచారణంటే కోర్టుకు పోతారని ఎద్దేవా చేశారు.



# గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వీఓఏలకు రూ. 20 వేలు వేతనం చెల్లించాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఐకెపి)లో పనిచేస్తున్న వేలాది మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌లకు (వీఓఏ) కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం కనీస గౌరవ వేతనం నెలకు రూ. 20 వేలకు పెంచాలని, జీఓ నెంబరు 58ని తక్ష ణమే రద్దుచేయాలని తెలంగాణ ఐకెపి వీఓఏ జెఏసి సేర్ప్ అధ్యక్షుడు నాగుల ప్రభాకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పర్చ పవన్, ప్రధాన కార్యదర్శి కేతావత్ శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 25వ తేదీలోగా ప్రభుత్వం తగిన నిర్ణయాన్ని తీసుకోవాలని, లేని పక్షంలో ఏ నిముషం లోనైన సేర్ప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో 17,667 వీఓఏలు రెండుదశాబ్దాలుగా మహిళా సంఘాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేస్తూ పనిచేస్తున్నారని చెప్పారు.

# రజాకార్ల దాడులు, అరాచకాల వాస్తవాలకు దృశ్యరూపం

## సినిమాను వీక్షించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** రజాకార్ సినిమాను కమర్షియల్ ఎలవెంట్స్ లేకుండా, నిజాం పాలనలో రజాకార్లు ప్రజలపై చేసిన దాడులు, అరాచకాల గురించి వాస్తవంగా కళ్ల ముందు కనిపించిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ప్రసాద్ లాబ్స్‌లో రజాకర్ సినిమా వీక్షించారు. ఈ సందర్భంగా రజాకర్ చిత్ర నిర్మాత గూడూరు నారాయణ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బైరాన్ పల్లి, గుండ్రాంపల్లి, పరకాల, నిర్మల్ వెయ్యి ఉరుల చెట్టు, జోడేఘాట్ వంటి చారిత్రక ప్రదేశాలు, ఆ ప్రాంతాల్లో జరిగిన పోరాటాలు వివరంగా చూపించారు. భావితరాలకు చరిత్రను తెలియజేయడం ముఖ్య లక్ష్యం అన్నారు. హైదరాబాద్ సంస్థానానికి స్వాతంత్రం ఎలా లభించిందో, గ్రామీణ ప్రాంతాల్లో నిజాం పాలనలో జరిగిన అత్యాచారాలు, అరాచకాలను తెలియజేసే విధంగా, అలాగే ఆర్యసమాజ్ వంటి సంస్థలు రజాకర్లకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటాన్ని స్పష్టంగా చూపించారని అన్నారు. గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం రజాకర్ సినిమాకు అవార్డు ప్రకటించిందని అన్నారు. గూడూరు నారాయణరెడ్డి చారిత్రాత్మకంగా మంచి సినిమా తీశారని అన్నారు. అన్ని జిల్లాల్లో బిజెపి కార్యకర్తల ద్వారా ప్రజలకు సినిమా చూపించే ప్రయత్నం చేస్తామన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్‌లో వేడుకలు జరగనున్నాయని అన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాను.

# హైదరాబాద్‌లో నవంబర్ 20 నుంచి తెలంగాణ-నార్త్‌ఈస్ట్ కనెక్ట్ ఫెస్టివల్

**హైదరాబాద్, సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంతో ఈశాన్య రాష్ట్రాలమధ్య శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక పరమైన బంధాన్ని మరింతగా పటిష్ఠపర్చేందుకుగాను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ఆలోచనల మేరకు తెలంగాణ - నార్త్‌ఈస్ట్ కనెక్ట్, టెక్నో, కల్చరల్ ఫెస్టివల్ అనే పేరుతో రెండు విడతలుగా మూడు రోజులు చొప్పున హైదరాబాద్‌లో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ తెలంగాణ - నార్త్‌ఈస్ట్ కనెక్ట్, టెక్నో, కల్చరల్ ఫెస్టివల్ కార్యక్రమాల నిర్వ హణపై గవర్నర్ కార్యాలయ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ గురవారం సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, సెర్ప్ సి.ఈ.ఓ దివ్య, కె. లక్ష్మీ, డైరెక్టర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీ మరియు ఛీఫ్ ఫెస్టివల్ కోఆర్డినేటర్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్. ప్రియాంక, పంచాయితీ రాజ్ శాఖ డైరెక్టర్ శ్రీజన, స్పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి సోని బాల దేవి, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. గవర్నర్ కార్యాలయ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ, తెలంగాణా, ఈశాన్య రాష్ట్రాల మధ్య శాస్త్ర, సాంకేతిక, వైద్య, మహిళా సాధికారిత, సాంస్కృతిక, క్రీడలు తదితర కార్యక్రమాలలో భాగంగా రెండు విడతలలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నవంబర్ 20, 21, 22 తేదీలలో మొదటి విడత, నవంబర్ 25, 26, 27 తేదీలలో రెండవ విడత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. దీనిలో భాగంగా, తెలంగాణా, ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించిన సాంస్కృతిక, సాహిత్య, మ్యూజికల్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. అదేవిధంగా, ఇరు వైపులకు సంబంధించిన ప్రముఖ సినిమాల ప్రదర్శన, మహిళా సాధికారత, అభివృద్ధి తదితర అంశాలపై చర్చా వేదికలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు అన్నారు. హైదరాబాద్‌లో మొట్టమొదటి సారిగా నిర్వహించే ఈ కార్యక్రమాలను విజయ వంతం చేయడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.



జయదేవ్‌ను సత్కరిస్తున్న వై.విజయ, సాంబశివరావు, రూపాదేవి, దేవికృష్ణ తదితరులు

# తెలుగు సినీదర్శకుల్లో మకుటాయమానం సిఎస్ రావు

## ఘనంగా ప్రముఖ సినీదర్శకుడి శతజయంతి వేడుకలు

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** లవకుశ, ఏకవీర, శాంతి నివాసం వంటి ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలకు దర్శకత్వం వహించి సినీచరిత్రలో రికార్డులు సృష్టించిన గొప్పదర్శకుడు సి.ఎస్.రావు అన్న ప్రముఖ సీనియర్ నటి వై.విజయ ఆయన తెలుగు సినీదర్శకుల్లో మకుటాయమానమని కొనియాడారు. 70 సినిమాలకు దర్శకత్వం వహించి లవకుశ, దేశమంటే మనుషులోయ్ సినిమాలకు 50 యేళ్ల క్రితమే జాతీయ పురస్కారం అందుకున్న ఘనత ఆయనకే సొంతమన్నారు. సిఎస్ రావు తన 12వ యేటనే తండ్రి సి.పుల్లయ్య దర్శకత్వంలో 1936లో అనసూయ సినిమాతో బాలనటుడుగా సినీరంగానికి వచ్చారని, ప్రముఖ సినీనటి, నర్తకీమణి రాజసులోచన సతీమణి అని వివ రించారు. నృత్య గాన లయ ట్రస్ట్-చెన్నై, రోటరీ సంప్రదాయ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో అలనాటి నటుడు, దర్శకుడు చిత్తజల్లు శ్రీనివాసరావు (సిఎస్ రావు) శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సిఎస్ రావు చిత్రపటానికి కుమార్తె దేవికృష్ణ, నటి వై.విజయ, సినీదర్శకుడు పి.సాంబశివరావు, నటి రూపాదేవి, నటుడు సుబ్రహ్మణ్యం, కృష్ణరౌతు, వడ్లమాని జవహర్, సంగీత దర్శకుడు నరహరి, రచయిత తులసి బాలకృష్ణ తది తరులు పూలమాలవేసి ఘననివాళులర్పించి ప్రసంగించారు. ఒక్క ఎన్టీఆర్‌తోనే తన తండ్రి సిఎస్ రావు 22 సినిమాలు తీశారని దేవికృష్ణ గుర్తుచేశారు. సిఎస్ రావు జీవితం, సినిమాలకు సంబంధించిన లఘుచిత్రంతోపాటు వారి సిని మాల్లోని పాటల మెలోడీని వీడియో రూపంలో ప్రదర్శించారు. చివరిగా సీనియర్ సినిమా జర్నలిస్టు రెంటాల జయదేవ్‌ను ఘనంగా సత్కరించారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు రమణ దేవరకొండ, జనార్ధన్‌రెడ్డి సమన్వయం చేశారు.

# నారాయణపూర్‌లో దొంగల బీభత్సం

## ఆరు ఇళ్లలో చోరీ.. నగలు, డబ్బులు అపహరణ

## రంగంలోకి క్లూస్ టీం.. ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు



**నర్సాపూర్ సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** నర్సాపూర్ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు తాళాలు వేసి ఉన్న 6 ఇళ్లలో జొరబడి బంగారు వెండి నగలు ఇతర వస్తువులు అందినకాడికి ఎత్తుకెళ్లిపోయారు. నారాయణపూర్ గ్రామానికి చెందిన నీరుడు బాలమని ఇంటికి తాళం వేసి లింగాపూర్ గ్రామానికి వెళ్లారు. ఈ క్రమంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చొరబడి అల్మారా తెరిచి అందులో ఉన్న నాలుగు తులాల బంగారు నగలను, ఇరవై తులాల వెండి పట్టగొలు సులు, కొంత డబ్బులు ఎత్తుకెళ్లారు అదేవిధంగా పక్కన ఉన్న మరో ఇల్లు నీరుడు చిన్న బాలమని ఇంట్లో మరియు పిచ్చకుంట్ల కుమార్ వీరు కూడా ఇంటికి తాళాలు వేసి బంధువుల వద్దకు వెళ్లారు.
ఈ ఇద్దరు ఇండ్లలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న వస్తువు లను చిందర వందరగా పడేశారు. అనం తరం ఎడ్ల పోచయ్య కొత్త ఇంటిలో దొంగలు చొరబడి బీరువాలో ఉన్న వస్తువులను చిందరవందరగా పడవేసి బీరువాలో ఉన్న పదివేల నగదు రూపా యలను 8 తులాల వెండిని తీసుకెళ్లి పోయారు. ఇంటి ముందు ఉన్న రోటం ప్రభాకర్ ఇంటి తాళాలు సైతం పగలగొట్టి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్, బియ్యం ఎత్తుకెళ్లారు. అదే విధంగా పిచ్చకుంట్ల నర్సింలు ఇంటి తాళాలు కూడా పగలగొట్టి ఇంట్లో చోరబడి వస్తువులను చిందర వందరగా పడవేసిన ఏమి దొరకలేదు నారా యణపూర్ గ్రామంలో ఆరు ఇళ్లలో దొంగలు చొర బడి అందిన కాడికి దోచుకెళ్లారు. ఈ సమాచారం తెలుసుకున్న తూప్రాన్ డి.ఎస్.పి నరేందర్‌గౌడ్‌తో పాటు ఎస్సై బి.లింగం పోలీసు బృందంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలిం చారు. బాధి .తులను అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్లూస్‌టీం రప్పించి అందరి ఇళ్లల్లో వివ రాలను వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై బి.లింగం తెలిపారు.

# శ్రీ చైతన్య విద్యాసంస్థల ఇన్ఫినిటీ లెర్న్ నుంచి ఎఐఎన్ఎ ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** శ్రీచైతన్య విద్యాసంస్థల భాగమైన దేశంలోని అగ్రగామి హైబ్రిడ్ లెర్నింగ్ ప్లాట్ఫారమ్ ఇన్ఫినిటీ లెర్న్ తన విప్లవాత్మక నూతన ఆవిష్కరణ ఏఐఎన్ఏ (ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్సీ న్యూటర్నింగ్ అసిస్టెంట్)ను అధికారికంగా గురువారం విడుదల చేసింది. ఏఐఎన్ఏ భారతదేశపు మొట్టమొదటి వాయిస్ ఫస్ట్, ఏఐ ఆధారిత మెంటార్. ఏఐఎన్ఏ సాధారణ చాట్ బాట్ కాదు. విద్యార్థులకు తక్షణ సందేహ నివృత్తి, లోతైన కాన్సెప్ట్ క్లారిటీ, టెస్ట్ అనాలిటిక్స్, ప్రోత్సా హక సహకారం, వ్యక్తిగత ప్రణాళిక ఇవన్నీ ఒకే వేదికలో, ఎప్పుడైనా, ఎక్కడైనా అందించే ప్రత్యేక ఏఐ మెంటార్గా రూపొందించబడింది. ఈ సందర్భంగా శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సీఈఓ డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ...సరైన సాధనాలు, వ్యక్తిగత పద్ధతి, సాంకేతిక మద్దతు కలిసివచ్చినప్పుడు నేర్చుకోవడం నిజమైన మార్పుని తెస్తుందన్నారు.ఏఐఎన్ఏతో ప్రతి విద్యార్థికి ఒక విశ్వసనీయ మెంటార్ లభిస్తాడని తెలిపారు.సమాధానాలు మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసం, ప్రేరణ కూడా అందిస్తూ విద్యార్థుల అసలైన సామర్థ్యాన్ని వెలికి తీయడమే మా లక్ష్యమన్నారు.ఇన్ఫినిటీ లెర్న్ వ్యవస్థాపక సీఈఓ ఉజ్వల్ సింగ్ మాట్లాడుతూ...ఏఐఎన్ఏ కేవలం ఒక ఏఐ మాత్రమే కాదని, ఇది భారతీయ విద్యార్థుల కోసం మేధస్సుతో కూడిన, మానవకేంద్రీకృత మార్గదర్శకత్వంలో కొత్త శకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. గూగుల్ క్లౌడ్ ఐఐఐటి హైదరాబాద్ సహకారంతో రూపొందిన ఈ టెక్నాలజీ ఇప్పటికే 96.7 శాతం ఖచ్చితత్వంతో సమాధానాలు ఇస్తోందని,నెలకు 2 లక్షలకు పైగా విద్యార్థుల సందేహాలను సగటున 5 సెకన్లలో పరిష్కరిస్తోందన్నారు.అదనంగా, ఇంగ్లీష్ తో పాటు 9 భారతీయ భాషల్లో కూడా సహాయం అందిస్తోంది" అన్నారు. ముఖ్యంగా 96.7శాతం సమాధానం ఖచ్చితత్వం( నీట్ 2025కు 97శాతం జేఈఈ మెయిన్స్ 2025కు 95 శాతం) ఇస్తుందన్నారు. ప్రతి నెలా 2 లక్షలకు పైగా సందేహాలకు పరిష్కారం చూపుతోందన్నారు.తక్షణ సమాధానాలు సగటు సమయం కేవలం 5 సెకనల్లో ఇస్తున్నట్లు తెలిపారు. బహుభాషా మెంటర్ ఇంగ్లీష్, ప్లస్ 9 భారతీయ భాషల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.ప్రస్తుతం ఇన్ఫినిటీ లెర్న్‌కు దేశవ్యాప్తంగా సుమారు 10 వేల స్కూళ్ళలో 10 లక్షల ప్రీమియం లెక్చరర్లు ఉన్నట్లు తెలిపారు. ఏఐఎన్ఐ ఇప్పుడు చెల్లింపు యూజర్లతో పాటు ఉచిత యూజర్లకు కూడా అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలతో భాగస్వామ్యాలు కూడా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.

# శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీశైలంలోకి వరద వెల్లువ

**హైదరాబాద్, సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** గోదావరి, కృష్ణా నదులలోని ప్రాజెక్టుల్లోకి ఎగువ నుంచి నీటి ప్రవాహాలు కొనసాగుతోండటంతో శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీశైలం ప్రాజెక్టుల్లోకి వరద వెల్లువెత్తుతోన్నది. గోదావరి నదిపై ఎస్సారెస్పీ రిజర్వాయర్‌లో 80.501టిఎంసిల నీరు ఉంది. రిజర్వాయర్‌లోకి 29545 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో అంతే మొత్తం నీరు కిందకు వదులుతున్నారు. కడెంలో 10వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో అంతే 13,342క్యూసెక్కుల నీరు కిందికి వదులుతున్నారు.



జాతీయ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ముఖ్యఅతిథులు, ఎన్ఐఆర్‌డిపిఆర్ అధికారులు

# గ్రామీణ దేశ నైపుణ్యాభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్

**అత్తాపూర్ సెప్టెంబరు 12(జర్నలిస్ట్‌ఫైల్):** రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్‌కు చెందిన ఎస్.ఆర్ శంకరన్ చైర్ రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. డిమాండ్‌వైపు నైపుణ్య అవసరాలను నిజమైన ఆర్థిక అవకాశాలతో సమలేఖనం చేయడం, స్కేలబుల్ స్కిల్లింగ్ నమూనాలకు ఆర్థిక సంస్థాగత మద్దతును సమీకరించడం, యాక్సెస్, సామర్థ్య అంతరాలను తగ్గించడానికి సాంకేతికత ఆవిష్కరణలను ఉపయోగిం చుకోవడం, జీవనోపాధి అభివృద్ధికి సమ్మిళిత, స్థిరమైన విధానాలను ప్రోత్స హించడమే లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ సాగింది. ఎన్ఆర్‌డిపిఆర్ క్యాంపస్‌లోని ఎస్‌కె కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అతిథులు ఎన్ఐఆర్‌డిపిఆర్, సిఇడిఎఫ్ఐ అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ ప్రార్థ ప్రతీమ్ సాహు, ఎన్ఐఇఎస్‌బియుడి డైరెక్టర్ జనరల్ డాక్టర్ పూనమ్ సిన్హా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన,మాజీ డైరెక్టర్ జనరల్ ఉషారాణి, అప్నా కో వైస్‌ప్రెసిడెంట్ డా.ప్రీత్ దీప్‌సింగ్, తెలంగాణ వి హబ్ సిఇఒ సీతా పల్లచోళ్లలకు ఎస్ఆర్ శంకర్ చైర్, చైర్ ప్రొఫెసర్ డా.జ్యోతిస్ సత్యపాలన్ స్వాగతం పలికారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ.. మౌలిక సదుపా యాల అభివృద్ధితో పాటు నైపుణ్యాభివృద్ధి కూడా అవసరమని అన్నారు. అనేక పథకాలు ఉన్నప్పటికి మనం నైపుణ్యాభివృద్ధిని పెంచగలమా వాటిని ప్రతిబిం బించగలమా అని అడిగినప్పుడు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఆర్థికవ్యవస్థ జ్ఞాన,ఆర్థిక వ్యవస్థల సృష్టికి ప్రాముఖ్యత ఉందని అన్నారు.



## మహిళా భద్రత, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

ఆగిరిపల్లి, సెప్టెంబర్ 12(జర్నలిస్ట్‌ఫైల్):

నూజివీడు డీఎస్పీ కె వి వి ఎన్ వి ప్రసాద్ ఆదేశాల మేరకు, నూజివీడు రూరల్ సీఐ కె. రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ తమ సిబ్బందితో కలిసి ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని, ఎస్.ఎఫ్.ఎస్ పాఠశాలలో విస్తృతమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలపై జరిగే నేరాలు (క్రైమ్ అగైనెస్ట్ విమెన్), సైబర్ నేరాలు, మరియు డయల్ 112 అత్యవసర సేవ గురించి విద్యార్థులకు వివరించారు. మహిళలు తమను తాము రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్ బ్యాడ్ టచింగ్, హింస, వేధింపులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్ లైన్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలు, వ్యక్తిగత సమాచారం దొంగిలించడం వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తెలియని లింకులు క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అత్యవసర సమయాలలో ప్రజలు డయల్ 112 కు ఫోన్ చేసి తక్షణ పోలీసు సహాయాన్ని పొందవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విద్యార్థిని విద్యార్థులకు ముఖ్యంగా యువతలో నేరాల పట్ల, భద్రత పట్ల అవగాహన పెంచడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పోలీసులు తెలిపారు.

## ఎంపీపీ పాలడుగు జ్యోత్స్నకు సన్మానం



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12(జర్నలిస్ట్‌ఫైల్):

ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న దుర్గా ప్రసాద్ కు సన్మానం చేశారు. గురువారం మండలం పరిషత్ కార్యాలయంలో ఆమె జన్మదినోత్సవం సందర్భంగా పలువురు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు. మండలం పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయం, ఎంఆర్ఓ కార్యాలయం సిబ్బంది ఘనంగా సత్కరించారు. ప్రజా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఎంపీడీవో సునీత శర్మ ఆధ్వర్యంలో నూతన కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మహాలక్ష్మిలను సన్మానించారు. చైర్మన్ చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసులు పాలడుగు జ్యోత్స్నా ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

## అన్నమ్మ చేవిటి మూగ స్కూల్లో విద్యార్థి అదృశ్యం



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12(జర్నలిస్ట్‌ఫైల్):

ఇబ్రహీంపట్నంలోని అన్నమ్మ చెవిటి మూగ డఫ్ అండ్ డం స్కూల్లో విద్యార్థి అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. గత నాలుగు రోజులుగా విద్యార్థి దైదా సన్ని కనిపించకపోయినా తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం ఫిర్యాదు చేయక పోవడంతో పలు అనుమానాలు కలుగుతున్నాయి. నాలుగు రోజుల క్రితం దైదా సన్నీ (16) సంవత్సరాలు విద్యార్థి నీ నాలుగు రోజుల క్రితం స్కూలు శుభ్రం చేయలేదని సాకుతో యాజమాన్యం వాటర్ పైపుతో తీవ్రంగా కొట్టడంతో తీవ్రరక్తస్రావం జరిగిందని తోటి విద్యార్థులు తమ మూగ సైగలతోనే పోలీసు అధికారులకు మండల తాసిల్దార్ కు చెబుతున్నారు. దీంతో తమ కొడుకుని స్కూల్ వాళ్లే చంపేసి ఉంటారంటూ తల్లి అనుమానం వ్యక్తం చేస్తుంది. గతంలో కూడా అన్నమ్మ మూగ చెవిటి డఫ్ అండ్ డం స్కూల్లో విద్యార్థినిపై నిర్వాహకరాలు శాంతకుమారి భర్త వెంకటేశ్వరరావు చేసి నందుకు గాను ఆ స్కూలు మూసి వేయడం జరిగింది దాదాపు రెండు మూడు సంవత్సరాల తర్వాత మరల అదే స్కూల్ నడిపించడం పై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని అన్నమ్మ మూగా చెవిటి డఫ్ అండ్ డం స్కూల్లో ఏంజరుగుతుంది. గత రెండు మూడు సంవత్సరాల క్రితం ఇదే స్కూల్లో ఓ విద్యార్థినిపై స్కూలు నిర్వాహకురాలు దాసరి శాంతకుమారి భర్త వెంకటేశ్వరరావు అఘాయిత్యానికి పాల్పడిన వైనం బయటపడటంతో ఆ స్కూలుకు ఉన్న పర్మిషన్లను రద్దు చేసిన అప్పటి అధికారులు. వ్యవహారం సర్దుమనికేంతవరకు దాదాపు రెండు మూడు సంవత్సరాలు వేచి చూసిన తరువాత ఎలాంటి పర్మిషన్లు లేకపోయినాను మరల అదే పేరుతో దివ్యాంగ విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నామని విదేశాల నుంచి వచ్చే ఆర్థిక సహాయాల కోసమే ఈ స్కూలునడిపిస్తున్నారంటూ బాధితురాలు తల్లి తండ్రులు ఆరోపిస్తున్నారు. గత 20ఏళ్లుగా ఇబ్రహీంపట్నంలోని అన్నమ్మ చెవిటి మూగ సేవిటీ మూగ డఫ్ అండ్ డమ్ పేరుతో కూల్ నడిపిస్తూ అనేకమైన స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి గాని విదేశాల నుంచి వచ్చే ఫండింగ్ ద్వారా గాని ఇతర లబ్ధి కోసమే ఈ స్కూలు నడిపిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు రికార్డు మేయిన్టైన్ చేయాలి కానీ ఎలాంటి రికార్డులు కూడా లేకుండానే స్కూలు యధావిధిగా నడిపిస్తున్న యాజమాన్యం. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# డయేరియా కేసులపై అప్రమత్తంగా ఉన్నాం

- బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం
- ప్రజలు వదంతులు నమ్మవద్దు
- ముందుజాగ్రత్తగా ట్యాంకర్ల ద్వారా ఆర్ఆర్‌పేటలో తాగునీటి సరఫరా
- ఆర్ఆర్ పేటలో ఇంటింటి మెడికల్ సర్వే నిర్వహించాం
- ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా, ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నాం
- రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ




విజయవాడ, సెప్టెంబర్ 12(జర్నలిస్ట్‌ఫైల్):

విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కేసులపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని.. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, డయేరియా కారణంగా ప్రాణ నష్టం జరగలేదని, వదంతులు నమ్మవద్దని రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం మంత్రివర్యులు పొంగూరు నారాయణ న్యూ రాజరాజేశ్వరిపేటలో పర్యటించి, డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ)లో మంత్రి నారాయణ.. జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పురపాలక శాఖ సంచాలకులు పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి వైద్య ఆరోగ్య శాఖ, మునిసిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డయేరియా ప్రబలకుండా ఇప్పటికే తీసుకున్న చర్యలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజరాజేశ్వరిపేటలో ముందుజాగ్రత్తగా కుళాయి నీటి సరఫరా ఆపేసి ట్యాంకర్ల ద్వారా, వివిధ మార్గాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించడం జరిగిందని.. కాచి వడపోసిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. ప్రత్యేక వైద్య శిబిరం, న్యూ జీజీహెచ్‌లో బాధితులకు వైద్యం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఒకసారి నీటి నమూనాలను పరీక్షించడం జరిగిందని.. లోపాలు కనిపించలేదని, మరిన్ని పరీక్షలు నిర్వహించడం ద్వారా సమస్యకు అసలు కారణాలను విశ్లేషించే పనిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

### 91549 70454తో కంట్రోల్ రూమ్ : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ

డయేరియా కేసుల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పరిస్థితి చక్కదిద్దేందుకు, సమన్వయానికి రెవెన్యూ, వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని.. డయేరియా మరణాలు సంభవించినట్లు వస్తున్న వార్తల్లో నిజంలేదని స్పష్టం చేశారు. ప్రత్యేక బృందాలతో తాగునీటి సరఫరా పైపులైన్ల వ్యవస్థలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. కేర్ అండ్ షేర్ స్కూల్లోని మెడికల్ క్యాంపు అత్యంత సమర్థవంతంగా సేవలందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పారిశుద్ధ్య చర్యలను కూడా విస్తృతం చేశామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

### డయేరియా కేసుల సమాచారం (సెప్టెంబర్ 11 సాయంత్రం 5 గంటల నాటికి)

- మొత్తం నమోదైన కేసులు: 102
- ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారు: 48
- చికిత్స తీసుకొని డిశ్చార్జ్ అయినవారు: 54 మంది

### 11 వార్డు సచివాలయాలకు ప్రత్యేక అధికారులు

డయేరియా కేసుల నేపథ్యంలో పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు 11 వార్డు సచివాలయాలకు సంబంధించి ఒక్కో సచివాలయానికి ఒక్కో ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య చర్యలు, అవసరమైన వారికి చికిత్స, గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులపై ప్రత్యేక దృష్టి, సౌకర్యాల కల్పన వంటివాటిపై ప్రత్యేక అధికారులు దృష్టిసారిస్తారని, నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తారన్నారు. వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయానికి కూడా ఈ ప్రత్యేక అధికారులు కృషిచేస్తారని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.



## దేవీ శరన్నవరాత్రి మహెూత్సవాలకు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)కు ఆహ్వానం

### ఆహ్వాన పత్రిక అందించిన దుర్గగుడి ఈవో, ప్రధాన అర్చకులు

విజయవాడ, సెప్టెంబర్ 12(జర్నలిస్ట్‌ఫైల్):

ఇంద్రకీలాద్రి పై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 తేదీవరకు జరగబోయే దసరా శరన్నవరాత్రి మహెూత్సవాలకు విచ్చేయాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ను ఇంద్రకీలాద్రి ఆలయ ఈవో శీనా నాయక్ ఆహ్వానించారు. గురువారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో ఎంపి కేశినేని శివనాథ్ కు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామిఆలయ ఈవో శీనా నాయక్ , ప్రధాన అర్చకులు ఎల్.దుర్గా ప్రసాద్, వేద పండితులు శ్రీధర్ ఆహ్వానపత్రిక అందించారు. వేద పండితులు ఎంపి కేశినేని శివనాథ్ కి వేద ఆశీర్వచనం చేయటంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రం అందజేశారు. ఆ తర్వాత ఇంద్రకీలాద్రి పై జరుగుతున్న శరన్నవరాత్రి మహెూత్సవ ఏర్పాట్ల గురించి ఎంపి కేశినేని శివనాథ్ అడిగి తెలుసుకున్నారు.

## స్థానికులకు అవకాశం ఇవ్వకపోతే అడ్డుకుంటాం

### బూడిద రవాణాను ప్రైవేట్ సంస్థకు ఇవ్వడంపై టీడీపీ కొండపల్లి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి రావి మణిరాజ్ (ఫణి ) ఆగ్రహం



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12(జర్నలిస్ట్‌ఫైల్):

బూడిద రవాణాను ప్రవేటు సంస్థకు ఇవ్వడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, జెన్కో యాజమాన్యం మొండిగా వ్యవహరించి ప్రవేటు ఇస్తే బూడిద కాలుష్యంతో ఇబ్బందిపడే స్థానిక ట్యాంకర్, టిప్పర్ యజమానులతో కలిసి అడ్డుకుంటామని టీడీపీ కొండపల్లి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి రావి మణిరాజ్ (ఫణి ) హెచ్చరించారు. గురువారం పశ్చిమ ఇబ్రహీంట్నంలోని తన కార్యాలయంలో స్థానికులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ బూడిద కాలుష్యం వల్ల ఏంతో మంది ఇబ్బంది పడుతున్నామని, ముఖ్యంగా బూడిద చెరువుకు దగ్గర ఉన్న పశ్చిమ ఇబ్రహీంపట్నం ప్రజలు తీవ్ర కాలుష్య సమస్యతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఆదాయం ప్రైవేట్ సంస్థకి వెళ్తే అనారోగ్యాలు తాము భరించాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. బూడిద చెరువు ద్వారా బూడిద రవాణా చేస్తూ స్థానికంగా ఉన్న ఎన్నో కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయని, ఇప్పుడు బూడిద రవాణా కాంట్రాక్ట్ ను ప్రవేట్ సంస్థకు అప్పగిస్తే తాము ఏ విధంగా బతకాలో చెప్పాలని కోరారు. స్థానికులకు అవకాశం కల్పించకుండా ప్రైవేట్ సంస్థ ద్వారా బూడిద రవాణా చేస్తే స్థానికులు, లోకల్ టిప్పర్, ట్యాంకర్ యజమానులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికైనా జెన్కో యాజమాన్యం తన వైఖరి మార్చుకొని స్థానికులకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

# ఎన్టీఆర్ ఆరోగ్య సేవలను మరింత విస్తరించాలి

- ఏరియా హాస్పటల్లో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలి లేకుంటే చర్యలు తప్పవు
- రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి



ఆగిరిపల్లి, సెప్టెంబర్ 12(జర్నలిస్ట్‌ఫైల్):

పేదలకు అందిస్తున్న ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవలు మరింత విస్తరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సూచించారు. వైద్యులను ప్రజలు దేవుడిలా బావిస్తారని అన్నారు. అలాంటి వైద్యులు రోగుల పట్ల సోదరభావంతో పనిచేయాలని చూసించారు. ఉదయం మంత్రి నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, మరియు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. విధినిర్వహణలో అలసత్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నా దృష్టికి డ్యూటీ డాక్టర్లు, మరియు ఇతర సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని వచ్చింది, ముక్యంగా రాత్రిపూట డ్యూటీలో ఎవరూ అందుబాటులో ఉండడం లేదని, సిబ్బంది ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదని, ఫిర్యాదులు అందాయని తీరు మార్చుకోపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ విభాగాల సిబ్బంది వివరాలు వారు చేసే పనులను క్షుణ్ణంగా తెలుసుకొని నిరంతరం పర్యవేక్షించాలని సూపరింటెండెంట్ కు ఆదేశించారు. ఓపీ విభాగాలను పరిశీలించి రోగుల నమోదు, వైద్యుల వద్దకు పంపిణీ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. రక్తనిధి కేంద్రం, సిటీస్కాన్, మలేరియా విభాగం, దంత విభాగం వంటి అన్ని విభాగాల్లో సేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అంతా పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. సూచిక బోర్డులు సక్రమంగా లేవని వెంటనే సరిచేయాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను ఇంటి వాతావరణంలా శుభ్రంగా ఉంచాలని సూచించారు. రోగుల అవగాహన కోసం గోడలపై అతికించిన పోస్టర్ల స్థానంలో గ్లాస్ గ్లో సైన్ బోర్డ్ ల శాశ్వత సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన అత్యవసర వైద్య పరికరాలు, ఫర్నిచర్ సామగ్రిని అవసరం మేరకు మంజూరు చేస్తామన్నారు. సత్వర చికిత్స, దంత చికిత్స, వినికిడి పరీక్షలు, రక్త పరీక్ష, ఎక్షరే, ఈసీజీ, వంటి విభాగాలను నిరంతరం పరిశీలించాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడవలసిన బాధ్యత మీ పై ఉందని మంత్రి ఆదేశించారు. వికలాంగులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని చూసించారు. రోగులు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేయాలని ఆదేశించారు. చిన్నారులు, వికలాంగులు, వృద్ధులు, రాకసౌలభ్యం కోసం మెట్ల వద్ద ర్యాంప్ సక్రముగా నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్‌ను లోపలకు అనుమతించకుండా బయటే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణంలో పూల మొక్కలతో సెన్సరీ గార్డెన్‌ను ఏర్పాటుచేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ప్రజలంతా మెరుగైన చికిత్స పొంది సంతోషంగా తిరిగి వెళ్లాలన్నారు. సింబ్బంది అంతా సమిష్టిగా పని చేసి ఆసుపత్రి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. సిబ్బంది అంకితభావంతో పని చేయాలని రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భారత్ మారిషస్ మధ్య దృఢమైన ద్వైపాక్షిక బంధం



## ప్రధానిమోడీకి మారిషస్ అత్యున్నత పురస్కారం

**వారణాసి, సెప్టెంబరు 12:** భారత్, మారిషస్ రెండు దేశాలే కానీ వాటి ధృక్పథాలు ఒకటేనని ప్రధాని నరేంద్ర మోడీఅన్నారు. ఇరు దేశాలు కేవలం భాగస్వామ్యులు మాత్రమే కాదని ఒక కుటుంబమని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాంతో భేటీ అయిన ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో పలు కీలక రంగాల్లో ఇరుదేశాల మధ్య ఒప్పందాలు జరిగాయి. భేటీ తర్వాత మాట్లాడిన ప్రధాని మోడీ, మారిషస్ ప్రత్యేక ఆర్థిక మండలి భద్రత, సముద్ర సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు. స్థానిక కరెన్సీలో వాణిజ్యం చేసేందుకు ఇరుదేశాలు నిర్ణయించాయని చెప్పారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సురక్షితమైన, స్థిరమైన, సంపన్నమైన హిందూ మహాసముద్రం భారత్, మారిషస్ రెండింటికీ ఉమ్మడి ప్రాధాన్యమని మోడీపేర్కొన్నారు. భారత్ ఎల్లప్పుడూ హిందూ మహా సముద్ర ప్రాంతంలో మొదటి ప్రతిస్పందన దారుగా నిలుస్తుందనిచెప్పారు. చాగోస్ ఒప్పందం ముగిసినందుకు మారిషస్ ప్రజలను ప్రధాని మోడీ అభినందించారు. అది సార్వభౌమాధికారానికి చారిత్రక విజయంగా అభివర్ణించారు. భారత్ ఎల్లప్పుడూ వలసరాజ్యాల నిర్మూలనకు, మారిషస్ సార్వభౌమత్వాన్ని పూర్తిగా గుర్తించడానికి మద్దతు ఇచ్చిందని తెలిపారు. అత్యున్నత పురస్కారం అందుకున్న మోడీ రామ్‌గులాం ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్నారు.

సెప్టెంబరు 9వ తేదీన విచ్చేసిన ఆయన, 16 వరకు మన దేశంలో ఉండనున్నారు. తన పదవీ కాలంలో భారత్‌కు ఆయనరావడం ఇదే తొలి సారి. త్వరలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు అయోధ్య, తిరుపతిని సందర్శించనున్నారు. అయితే మోడీ, మార్చిలో మారిషస్‌ను సందర్శించారు. ఆ సమయంలో మారిషస్ అత్యున్నత పురస్కారం అందుకున్నారు. తమ దేశ అత్యున్నత పురస్కారం ది గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అండ్ కీ ఆఫ్ ది ఇండియన్ ఓషన్‌ను మోడీకి రామ్‌గులాం ప్రకటించారు. ఆ గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారత ప్రధానిగా మోడీ ఘనత సాధించారు. అయితేమరిషస్‌లో ఎక్కువ మంది భారత సంతతి వ్యక్తులే ఉంటారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తారు. ఆ దేశానికి కష్టమొస్తే మొదట స్పందించేది మన దేశమే. పలు విపత్తుల్లో ఆపన్నహస్తం అందించింది. కొవిడ్ సమయంలో ఆ దేశానికి 13 టన్నుల ఔషధాలు, 10 టన్నుల ఆయుర్వేద మందులు పింపిణీ చేసింది. ఇండియన్ ర్యాపిడ్ రెస్పాన్స్ మెడికల్ టీమ్‌ను అక్కడికి పంపించింది. అంతేకాదు, లక్షల వ్యాక్సిన్లను ఉచితంగా పంపించింది. మారిషస్ కూడా భారత్‌కు 200 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్‌ను విరాళంగా ఇచ్చింది. 2016లో మారిషస్‌కు భారత్ స్పెషల్ ఎకనామిక్ ప్యాకేజ్ ప్రకటించింది. అక్కడ మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్ట్, సుప్రీంకోర్టు భవనం, ఇఎన్‌టి ఆస్పత్రి, సోషల్ హౌసింగ్ ప్రాజెక్ట్, విద్యార్థుల కోసం డిజిటల్ టేబుల్స్ కోసం రూ. 3వేల కోట్లు ప్రకటించింది. పలు ప్రాజెక్టుల కోసం మరో రూ.4వేల కోట్లు అప్పు రూపంలో ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఇవేకాకుండా ఉపాధ్యాయ్ ట్రెనింగ్ సెంటర్, జవహర్‌లాల్ నెహ్రూ ఆస్పత్రి, సుబ్రమణ్య భారతి కంటి ఆస్పత్రి, నేషనల్ లైబ్రరీ, పోలీస్ అకాడమీ, రాజీవ్ గాంధీ సైన్స్ సెంటర్, స్వామి వివేకానంద ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్ ప్రాజెక్టులకు భారత్ ఆర్థిక సాయం చేస్తోంది.



## పారిపోతున్న ఖైదీలపై సైనికుల కాల్పులు

### నేపాల్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

**కఠ్మాండూ, సెప్టెంబరు 12:** నేపాల్ జెన్-జెడ్ ఉద్యమకారులు చేపట్టిన ఆందోళనలను ఆసరాగా తీసుకొని జైళ్ల నుంచి ఖైదీలు పరారవుతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రామెచాప్ జైలు నుంచి పారిపోతున్న కొందరు ఖైదీలపై ఆర్మీ బలగాలు కాల్పులు జరిపాయి. దీంతో దేశంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం జైలు గేటు తాళాలను విరగ్గొట్టి ఖైదీలు పారిపోయేందుకు ప్రయత్నించారని చీఫ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ శ్యామ్‌కృష్ణ థామా పేర్కొన్నారు. వారిని అడ్డగించేందుకు ఆర్మీ బలగాలు కాల్పులు జరిపాయన్నారు. ఈకాల్పుల్లో డజను మందికిపైగా ఖైదీలు గాయపడ్డారని వెల్లడించారు. అయితే, కాఠ్మాండూ, ఫోఖరా, లలిత్‌పుర్‌లోని జైళ్ల నుంచి ఇప్పటికే వందలాది మంది ఖైదీలు తప్పించుకున్నట్లు స్థానిక మీడియాపేర్కొంది. మొత్తం 7,000 మంది ఖైదీలు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఇక, జైలు నుంచి పారిపోయి వస్తున్న నేపాలీ ఖైదీలను భారత సాయుధ పోలీసు దళం పట్టుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్ సమీపంలోని 22 మంది నేపాలీ ఖైదీలను అడ్డుకున్నట్లు ఎస్ఎస్‌బి అధికారులుతెలిపారు. నేపాల్‌లో ఆందోళనల నేపథ్యంలో సరిహద్దుల్లో ఎస్ఎస్‌బినే భద్రతను పర్యవేక్షిస్తుంది. దేశంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని కాఠ్మాండూ మేయర్ బాలెన్ షా విజ్ఞప్తి చేశారు. గురువారం నిరసనకారులను ఉద్దేశిస్తూ ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'దయచేసి ఓపికపట్టండి. దేశంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటవుతుంది. ఆ తర్వాత కొత్తగా ఎన్నికలు కూడా జరుగుతాయి' అని రాసుకొచ్చారు. సామాజిక మాధ్యమాలపై నిషేధంతో ప్రారంభమైన జెన్-జడ్ ఉద్యమం.. అవినీతి వ్యతిరేక ఉద్యమంగా మారి హింసాత్మక ఘటనలకు దారితీసింది. కాఠ్మాండూతో సహా పలు నగరాల్లో పెద్ద ఎత్తున ఘర్షణలు జరగడంతో ఆర్మీ కర్ఫ్యూ విధించింది. ఈ ఆందోళనల్లో ఇప్పటివరకు 25 మంది ప్రాణాలు కోల్పోగా.. 600 మందికిపైగా గాయపడ్డారు.



## మహారాష్ట్ర గవర్నర్‌గా వైదొలిగిన రాధాకృష్ణన్

**ముంబయి, సెప్టెంబరు 12:** మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి సిపి రాధాకృష్ణన్ వైదొలిగారు. ఇటీవలే జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఆయన గెలుపొందిన విషయం తెలిసిందే. రేపు ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో మహా గవర్నర్ పదవి నుంచి వైదొలిగారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవ వ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ అధికారికంగా ప్రకటించింది. భారత 15వ ఉప రాష్ట్రపతిగా ఎన్డీఎఅభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. ఈ నేపథ్యల శుక్రవారం రాష్ట్ర పతి భవన్‌లో రాధాకృష్ణన్ చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

## అదంతా నాపై జరుగుతున్న పెయిడ్ క్యాంపెయిన్!

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలవడం (ఇ20)పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా స్పందించారు. అదంతా తనను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుని, డబ్బులిచ్చి నడిపిస్తున్న ప్రచారం అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. సొసైటీ ఆఫ్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ వార్షిక సదస్సులో పాల్గొన్న ఆయన, ఇథనాల్ మిశ్రమంపై వస్తున్న ఆందోళనలపై అడిగిన ప్రశ్నలకు ఈ విధంగా బదులిచ్చారు. మీ ఆటోమొబైల్ పరిశ్రమ ఎలా పనిచేస్తుందో, రాజకీయాలు కూడా అలాగే ఉంటాయి. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి డబ్బులు ముట్టాయి. అది రాజకీయంగా నన్ను దెబ్బతీయడానికే. అందులో ఎలాంటి నిజం లేదు. ప్రతి విషయం స్పష్టంగా ఉందని గడ్కరీ అన్నారు. ఇథనాల్ మిశ్రమం అనేది విదేశీ ఇంధన దిగుమతులకు ప్రత్యామ్నాయమని, ఖర్చు తక్కువని, కాలుష్య రహితమని, పూర్తిగా స్వదేశీ అని ఆయన పునరుద్ఘాటించారు. భారత్ ఏటా శిలా ఇంధనాల దిగుమతి కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తోందని గడ్కరీ గుర్తుచేశారు. ఆ దిగుమతులను తగ్గించి, ఆ డబ్బును దేశ ఆర్థిక వ్యవస్థలో భాగం చేయడం మంచిది కాదా అని ఆయన ప్రశ్నించారు. మనం మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తున్నాం.

ఈ విధానం వల్ల రైతులకు రూ. 45,000 కోట్ల లాభం చేకూరిందని ఆయన వివరించారు. కాలుష్యం కోణంలోనూ ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాలుష్య స్థాయిలు ఇలాగే కొనసాగితే ఢిల్లీ వాసుల ఆయుష్షు పదేళ్లు తగ్గిపోతుందని ఓ నివేదిక చెబుతోంది. ప్రపంచమంతా కాలుష్యాన్ని తగ్గించాలని అంగీకరిస్తోందని తెలిపారు. ఇ20 పెట్రోల్ వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందని, ఇంజిన్ భాగాల జీవితకాలం తగ్గిపోతోందని కొందరు వాహనదారులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ వాదనలు అవాస్తవమని ప్రభుత్వం కొట్టిపారేసింది. వాహన మైలేజీ అనేది కేవలం ఇంధనంపైనే కాకుండా, నడిపే విధానం, టైర్లలో గాలి, ఏసి వాడకం, సరైన నిర్వహణ వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది. పైగా, ని20 పెట్రోల్ వల్ల మెరుగైన యాక్సిలరేషన్, రైడ్ క్వాలిటీతో పాటు కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ విధానాన్ని వెనక్కి తీసుకుంటే కాలుష్య నియంత్రణలో సాధించిన ప్రగతిని కోల్పోవాల్సి వస్తుందని పేర్కొంది.

## ఎన్నికల వేళ పాట్నాలో ఆర్జేడి నేత దారుణ హత్య

**పాట్నా, సెప్టెంబరు 12:** బీహార్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల వేళ కాల్పులు కలకలం రేపుతున్నాయి. రాష్ట్రీయ జనతా దళ్ నేత, వ్యాపారి రాజ్‌కుమార్ రాయ్ (52) పాట్నాలోని రాజేంద్ర నగర్ సమీపంలో దారుణంగా హత్య చేయబడ్డారు. రాజేంద్ర నగర్ టెర్మినల్ సమీపంలోని గల్లీ నెంబర్ 17 వద్ద ఈ దాడి జరిగింది. ఇద్దరు గుర్తు తెలియని దుండగులు రాజ్‌కుమార్ రాయ్‌ను వెంబడించి, ఆరు బుల్లెట్లతో కాల్చి చంపారు. రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ హత్య జరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.రాయ్ దాడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, దగ్గరి నుంచి కాల్పులు జరపడంతో కుప్పకూలిపోయారని సాక్షులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న తన అనుచరులు వెంటనే అతన్ని సమీప ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు ఘటనా స్థలం నుంచి ఆరు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. సమీపంలోని సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. దీంతోపాటు స్థానికులను విచారిస్తున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



## అమెరికాలో ఉధృతంగా 'కిస్సింగ్ బగ్'!

### మూడు లక్షలమందికి ఈబగ్‌తో వచ్చిన చాగస్ వ్యాధి

**వాషింగ్టన్, సెప్టెంబరు 12:** అమెరికాలోని 32 రాష్ట్రాల్లో ఇపుడు కిస్సింగ్ బగ్ అంటే రక్తంపీల్చే పరాన్నజీవిద్వారా చాగా వైరస్ వ్యాపిస్తోంది. దేశంలోని వ్యాధినియంత్రణ, నివారణ సంస్థ సిడిసి ప్రజలకు తీవ్రస్థాయి ఆరోగ్య హెచ్చరికలు జారీచేసింది. కేవలం లాటిన్ అమెరికా సమస్యగానే ఉన్న ఈవ్యాధి ఇపుడు 32 రాష్ట్రాల్లో వేలాదిమందిలో ఉందని సిడిసి హెచ్చరించింది. ట్రియాటోమైన్ బగ్స్ లేదా కిస్సింగ్ బగ్స్ అని పిలిచే కొన్ని రక్తాన్ని పీల్చే కీటకాలనుంచి వ్యాపిస్తున్న ట్రిపనోసోమా క్రూజీ అనే పరాన్నజీవివల్ల చాగస్‌వ్యాధి సోకుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ ప్రాణాంతక కీటకాలు ప్రజలు నిద్రిస్తున్న సమయంలో నోరు, కళ్ల చుట్టూ కొరుకుతుందని అందుకే వాటికి ఆపేరు వచ్చిందని చెపుతున్నారు. ఈసంస్థ అధ్యయనం ప్రకారం అమెరికాలో మూడు లక్షలకంటే ఎక్కువమంది ఇప్పటికే చాగస్ వ్యాధిబారిన పడి ఉండవచ్చని అంచనా వేసింది. కానీ 2 శాతం కంటే తక్కువమందికి సోకిన చాగస్ కిస్సింగ్ బగ్‌నుంచే వచ్చిందని తేల్చింది. అయితే ఈ చాగస్‌వ్యాధి సంవత్సరాలపాటు దాగి ఉంటుందని, నష్టంజరిగేవరకూ కూడా కొన్ని కేసుల్లో వ్యాధి లక్షణాలు కనిపించవని చెపుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలప్రకారం ప్రతిఏటా సుమారు పది వేలమంది ఈచాగస్ వ్యాధితో మరణిస్తున్నారు.

## ట్రంప్ విధేయుడు చార్లీ కిర్క్‌ను కాల్చిహత్యచేసిన దుండగుడు



**వాషింగ్టన్,సెప్టెంబరు 12:** అమెరికాలోని యూటా రాష్ట్రంలో ఓ స్నైపర్ కోసం పోలీసులు, ఫెడరల్ ఏజెంట్లు ముమ్మరంగా గాలిస్తున్నారు. ప్రముఖ కన్జర్వేటివ్ యాక్టివిస్ట్, దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్‌ను అత్యంత పకడ్బందీగా, ఓ భవనం పైకప్పునుంచి ఓ స్నైపర్ సింగిల్ బుల్లెట్‌తో చంపిన ఘటన తీవ్ర కలకలం రేపింది. హంతకుడిని పట్టుకునేందుకు అధికారులు పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టారు. యూటా వ్యాలీ యూనివర్సిటీలో జరిగిన 'ది అమెరికన్ కమ్‌బ్యాక్' అనే కార్యక్రమంలో ఈ దారుణం చోటుచేసుకుంది. సుమారు 3000 మంది పాల్గొన్న ఈ సభలో చార్లీ కిర్క్ ప్రసంగిస్తూ, తుపాకీ హింసపై అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తున్నారు. ఓ వ్యక్తి ట్రాన్స్‌జెండర్ మాస్ షూటర్ల గురించి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తుండగా, ఒక్కసారిగా ఆయన గొంతులోంచి రక్తంచిమ్మింది. ఏం జరిగిందో తెలుసుకునేలోపే ఆయన వేదికపైనే కుప్పకూలిపోయారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా ఫలితం లేక పోయింది. ఈ ఘటనలో కిర్క్ మాత్రమే గాయపడ్డారని, మిగతా వారంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు.ఈ దాడిని అత్యంత తీవ్రంగా పరిగణించిన పోలీసులు, క్యాంపస్‌లోని ఓ భవనం పైకప్పు నుంచి స్నైపర్ కాల్పులు జరిపిఉంటాడని బలంగా అనుమానిస్తున్నారు. సెక్యూరిటీ కెమెరా ఫుటేజ్‌లో నల్లటి దుస్తులు ధరించిన ఓ వ్యక్తి కనిపించాడని, అతడి కోసమే గాలిస్తున్నామని తెలిపారు. పోలీసులు కిర్క్‌పై కాల్పులు జరిపిన ప్రదేశం, అనుమానితుడు ప్రయాణించిన మార్గాలను యాక్టివ్ క్రైమ్ సీన్స్‌గా గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు విచారణలో స్థానిక పోలీసులకు ఫెడరల్ ఏజెంట్లు కూడా సహకరిస్తున్నారు. ఈ హత్య నేపథ్యంలో దాదాపు 47,000 మంది విద్యార్థులున్న యూటా వ్యాలీ యూనివర్సిటీలో అధికారులు సెక్యూర్ ఇన్ ప్లేస్ ఆదేశాలు జారీ చేసి, క్యాంపస్‌ను గంటలపాటు మూసివేశారు. ఘటన తర్వాత ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించినప్పటికీ,వారికి ఈహత్యతో సంబంధం లేదని తేలడంతో విడుదల చేశారు. అయితే, పోలీసుల విచారణకు ఆటంకం కలిగించాడనే ఆరోపణలపై ఓ రాజకీయ కార్యకర్తపై కేసు నమోదు చేసినట్లు యూనివర్సిటీ పోలీసులు తెలిపారు. ప్రస్తుతం స్నైపర్‌ను పట్టుకోవడానికి పెద్ద ఎత్తున వేట కొనసాగుతోంది. ఈ హత్య వెనుక ఉన్న ఉద్దేశం ఏంటనేది ఇంకా తెలియరాలేదు. ఈ ఘటన అమెరికాలో రాజకీయ హింస, తుపాకీ సంస్కృతిపై మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది.

## సంక్షిప్తంగా..

### 30 మంది నేపాల్ ఖైదీలను పట్టుకున్న ఎస్ఎస్‌బి



**డెహ్రాడూన్, సెప్టెంబరు 12:** నేపాల్‌లో నెలకొన్న అశాంతిని ఆసరాగా చేసుకుని అక్కడి జైళ్లనుంచి తప్పించుకున్న ఖైదీలు భారత్‌లోకి ప్రవేశించేందుకు చేసిన యత్నాలను సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి) బలగాలు భగ్నం చేశాయి. దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన 30మంది నేపాలీ ఖైదీలను ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల సరిహద్దుల్లో అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో కేంద్ర భద్రతా ఏజెన్సీలు భారత్‌నేపాల్ సరిహద్దులో హై అలర్ట్ ప్రకటించాయి. నేపాల్‌లో జరుగుతున్న హింసాత్మక నిరసనల మధ్య పలువురు ఖైదీలు జైళ్ల నుంచి పారిపోయారు. వీరిలో కొందరు భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన ఎస్ఎస్‌బి జవాన్లు సరిహద్దుల్లో గస్తీని ముమ్మరం చేసి చొరబాట్లను అడ్డుకున్నారు. అరెస్టయిన వారిలో 17 మందిని ఉత్తరప్రదేశ్‌లో, మిగిలిన 13 మందిని బీహార్, పశ్చిమ బెంగాల్ సరిహద్దు ప్రాంతాల్లో పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

### ఎబివిపి కార్యక్రమంలో కాంగ్రెస్ మంత్రి!

**బెంగళూరు, సెప్టెంబరు 12:** అనుబంధ విద్యార్థి సంస్థ అయిన ఎబివిపి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం వివాదానికి దారితీసింది. ఇది రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు కారణమైంది. తుమకూరు జిల్లా తిప్టూరులో ఎబివిపి స్థానిక శాఖ 'రాణి అబ్బక్క రథయాత్ర', 'పంజిన పరేడ్' అంటే కాగడాల ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించింది. భారతీయ జనతా పార్టీ మద్దతుతో జరిగిన ఈ కార్యక్రమాన్ని హోంమంత్రి పరమేశ్వర స్వయంగా ప్రారంభించారు. సాధారణంగా బిజెపి, దాని సైద్ధాంతిక మాతృక అయిన ఆర్ఎస్ఎస్‌పై, వాటి అనుబంధ సంస్థలపై కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు చేస్తుంటారు. మతతత్వ విభజనను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపిస్తుంటారు. అలాంటిది, స్వయంగా హోంమంత్రే ఎబివిపి వేదికపై కనిపించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. పరమేశ్వర చర్య తన పార్టీ సిద్ధాంతాలకు, ప్రకటించిన విధానాలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని, ఇది ఎబివిపికి పరోక్షంగా మద్దతు తెలపడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

### విమానంలో ఎసి పనిచేయక ప్రయాణీకులకు ఇక్కట్లు

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 12:** ఎయిర్ ఇండియా విమానాల్లో తరచూ తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సింగపూర్ వెళ్లాల్సిన విమానంలో ఎసి పనిచేయక పోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. దాదాపు రెండు గంటలపాటు వేచిచూసినా ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్యాసింజర్స్‌ను దించేశారు. 200 మందికిపైగా ప్రయాణికులతో ఎయిర్ ఇండియా చెందిన బోయింగ్ 7879 డ్రీమ్‌లైనర్ ఎయిర్‌క్రాఫ్ట్ బుధవారం రాత్రి 11గంటల సమయంలో సింగపూర్‌కు బయల్దేరాలి. సాంకేతిక సమస్య తలెత్తిందని అనౌన్స్‌మెంట్ చేశారు. రెండు గంటలు గడిచినా మరమ్మత్తులు పూర్తి కాలేదు. కారణం ఏంటనే తెలుపకుండానే ప్రయాణికులను విమానంలో నుంచి కిందకు దించేసి ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ బిల్డింగ్‌కు తరలించారు. అయితే ఈ ఘటనపై టాటాల ఆధ్వర్యంలోని ఎయిరిండియా ఇప్పటిదాకా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. అయితే ఎసి పనిచేయక పోవడం వల్లే సమస్య తలెత్తినట్లు తెలుస్తున్నది.

### పిఎంకెనుంచి కుమారుడిని తొలగించిన సీనియర్ నేత అన్బుమణి

**చెన్నై, సెప్టెంబరు 12:** పత్తలి మక్కల్ కచ్చి(పిఎంకె) వ్యవస్థాపకుడు ఎస్ రామదాస్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి ఆయన కుమారుడు అన్బుమణి రాందాస్‌ను తొలగించినట్లు ప్రకటించారు. అన్ని పోస్టుల నుంచి అన్బుమణిని తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తండ్రి ఆరోపించారు. కుమారుడిని కలుపు మొక్కతో పోల్చారు. కుటుంబంలో చెలరేగిన చిచ్చును చల్లార్చేందుకు అన్బుమణి పలుమార్గాల్లో ప్రయత్నాలు చేశారు. కానీ ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. అన్బుమణిపై ఉన్న 16 ఆరోపణలకు సమాధానం ఇవ్వడం విఫలమైనట్లు ఆరోపించారు. తైలపురంలో ఉన్న ఫార్మ్‌హౌజ్‌లో జరిగిన భేటీ తర్వాత సీనియర్ రాందాస్ ఈ ప్రకటన చేశారు. పీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాత్రమే కాదు, అతన్ని పార్టీ నుంచి పూర్తిగా వెలి వేస్తున్నట్లు సీనియర్ రాందాస్ తెలిపారు. అన్బుమణి అనే కలుపు మొక్కను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు ఆయన చెప్పారు.16 అభియోగాలపై వివరణ ఇవ్వాలని అన్బుమణికి షోకాజు నోటీసులు ఇచ్చామన్నారు. కానీ ఆయన వ్యక్తిగతంగా కానీ, లిఖితపూర్వకంగా కానీ సమాధానం ఇవ్వలేదన్నారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికలో క్రాస్ ఓటింగ్?

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 12:** ఉపరాష్ట్రపతి ఎన్నికల ఫలితాలు విపక్ష ఇండియా కూటమిలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఎన్డీఏ అభ్యర్థికి ఊహించిన దానికంటే 14 ఓట్లు అదనంగా లభించడంతో కూటమి ఐక్యతపై మరోసారి సందేహాలు మొదలయ్యాయి. ఇటీవలజరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, ఇండియా కూటమి తరఫున బరిలో నిలిచిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు మాత్రమే లభించాయి. వాస్తవానికి ఎన్డీఏకు ఉన్న సంఖ్యాబలం కంటే 14 ఓట్లు ఎక్కువగా పోలవ్వడంతో విపక్షాల శిబిరంలో క్రాస్ ఓటింగ్ జరిగిందని స్పష్టమైంది. ఈ ఫలితాలు ఇండియా కూటమిలోని పార్టీల మధ్య తీవ్ర అపనమ్మకాన్ని సృష్టించాయి. ఈ పరిణామాలపై ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్పందించారు. క్రాస్ ఓటింగ్ గురించి తాను ప్రత్యేకంగా మాట్లాడబోనని, జరిగిందంతా దేశ ప్రజలు గమనించారని ఆయన వ్యాఖ్యానించారు. పదవుల కోసం పార్టీల్లో చేరాల్సిన అవసరం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. పోలింగ్‌లో కొన్ని ఓట్లు చెల్లుబాటు కాకపోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని ఆయన అన్నారు. మరోవైపు ఈ క్రాస్ ఓటింగ్ వ్యవహారం ఇండియా కూటమిలో అంతర్గత ఆరోపణలకు దారి తీసింది. ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఒకరిపై ఒకరు అనుమానాలు వ్యక్తం చేసుకుంటున్నాయి. ఆర్జేడీ, జేఎంఎం, శివసేన (యూబీటీ) పార్టీలకు చెందిన కొందరు ఎంపీలు కూడా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి ఉండవచ్చని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

## గుజరాత్‌లో 307 సింహాలు మృతి

**అహ్మదాబాద్, సెప్టెంబరు 12:** గుజరాత్‌లోని గత రెండేళ్లలో ఏకంగా 307 సింహాలు మృత్యువాత పడ్డాయి. ఆగస్టు 1, 2023 నుంచి జూలై 31, 2025 మధ్య 307 సింహాలు మరణించినట్టు గణాంకాలు వెల్లడయ్యాయి. అయితే వాటిల్లో కేవలం 16 శాతం మాత్రమే వృద్ధాప్యం వంటి సహజకారణాలతో మరణించాయి. మిగతా 70 శాతం సింహాలు అనారోగ్యం, తోటి జంతువులతో పోరాటాల కారణంగా చనిపోయాయి. ఈ మేరకు బుధవారం గుజరాత్ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం డేటాను ప్రవేశపెట్టింది. చనిపోయిన సింహాల్లో 50 సింహాలు సహజ కారణాల వల్ల, 141 అనారోగ్యంతో, 74 అంతర్గత పోరువల్ల మరణించినట్టు సదరు డేటా వెల్లడించింది.

## అమెరికా చేసిందే మేమూ చేశాం

### ఖతార్‌లో దాడులను సమర్థించుకున్న నెతన్యాహు



**టెల్‌అవీవ్, సెప్టెంబరు 12:** హమాస్ కీలక నేతలే లక్ష్యంగా ఖతార్ రాజధాని దోహాపై ఇజ్రాయెల్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీన్ని పలు దేశాలు ఖండించాయి. అయితే, ఈ దాడులను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సమర్థించుకున్నారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడులను.. అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చారు. గురువారం ఆయన ఓ విడియోలో మాట్లాడారు. హమాస్‌తో యుద్ధానికి దారితీసిన అక్టోబరు 7 నాటి దాడులను ఆయన ప్రస్తావించారు. వీటిని అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చుతూ.. నాడు యుఎస్ ఎలా స్పందించిందో ప్రస్తుతం తాము అలాగే చేశామన్నారు. '9/11 దాడుల తర్వాత వాటికి కారణమైన ఉగ్రవాదులు ఏ దేశంలో ఉన్నా వెంటాడి హతమారుస్తామని నాడు అమెరికా చెప్పింది. దీనిపై ఐక్యరాజ్య సమితిలో తీర్మానం కూడా చేసింది. ఇప్పుడు మేము అది చేశాం' అని నెతన్యాహు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అఫ్ఘానిస్థాన్‌లో అల్-ఖైదా ఉగ్రవాదులను వెంటాడి, తర్వాత పాకిస్థాన్‌లో ఉన్న కరుడుగట్టిన ఉగ్రవాది, అల్‌ఖైదా నేత ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికా బలగాలు చంపేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

తమ చర్యలను ఖండిస్తున్న పలు దేశాలను నెతన్యాహు తప్పుబట్టారు. ఆత్మరక్షణ కోసం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఇందుకు తమను ప్రశంసించాల్సింది పోయి.. తప్పుబడుతున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు.. ఖతార్‌పై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. హమాస్‌కు ఆ దేశం సురక్షితమైన స్వర్గధామంగా మారిందన్నారు. ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తోందన్నారు. ఖతార్‌సహా ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలను ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అలాంటి వారిని బహిష్కరించాలని, లేదంటే చట్టం ముందు నిలబెట్టాలన్నారు. అలా చేయకపోతే.. ఇజ్రాయెల్ చర్యలకు దిగుతుందన్నారు. కాల్పుల విరమణకు సంబంధించి యుఎస్ ప్రతిపాదించిన మేరకు దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో వారెవరూ ప్రాణాలు కోల్పోలేదు. అయితే, ఈ దాడులను ఖతార్‌తీవ్రంగా పరిగణించింది. భారత్‌తో సహా పలుదేశాలు ఈదాడులను ఖండించాయి.

## ఎల్వోసీ చెక్కు అందజేత



మంగళగిరి టౌన్,(జర్నలిస్ట్ ఫైల్): అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి పట్టణంలోని టిడ్కోకు చెందిన బట్టు నాగేశ్వరమ్మ కి మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 70,000/- విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్వోసీ) ముంజురైంది. శుక్రవారం టీడీపీ నాయకులు బాధితురాలి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఎల్వోసీ చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్ కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్,పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు వాసా పద్మావతి,బూదాటి శ్రీనివాసరావు,కొల్లి శ్రీనివాసరావు, ఉప్పు మహేష్,ఇండ్ల రజిని, గంజి శివ సుధా, దండే శ్రీ లక్ష్మి, చెన్నపట్నం సత్య,అవ్వారు సుబ్బారావు, గంజి పూర్ణ,విజయ్ కుమార్, షేక్ షైదా,జంజనం యస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే దోమల నిర్మూలన సాధ్యం



○ తెనాలిసహాయమలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి

తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) తెనాలిపట్టణచినరావూరుతోటలోని మదర్ థెరిస్సానగర్ నందు ఫ్రైడేడ్రైడేకార్యక్రమంలోభాగంగామలేరియాశాఖవారి ఆధ్వర్యంలోర్యాలీ నిర్వహించారు. తెనాలి సహాయమలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ నీటి నిలువ లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవగాహనతోనే దోమల నిర్మూలన సాధ్యమని ప్రజలు ఎక్కడ నీటిని నిలవలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల యొక్క ఉత్పత్తి తగ్గి దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ,ఫైలేరియా, చికెన్ గునియా, మెదడువాపువంటి వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. తెనాలి పట్టణ సబ్ యూనిట్అధికారిశ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రజలు ఇంటి లోపల ఇంటి బయట నీటి నిల్వలు లేకుండా చూసుకొనవలెనని ముఖ్యంగా ఇంటి లోపల ఉండే కూలర్లు ఫ్రిజ్లు మరియు రుబ్బురోలల్లో వర్షపు నీరు గాని లేక ఇతర నీటి నిల్వలు వల్ల కానీ దోమల సంఖ్య వృద్ధి చెందుతాయని తెలిపారు. అనగా చెక్ క్లీన్ అండ్ కవర్ విధానాల ద్వారా నీటిని నిలవలను పరిశీలించుకొని శుభ్రపరచుకొని వాటిపై మూతలు పెట్టుకొనడం ద్వారా దోమలు గుడ్లు పెడతానికి అవకాశం కలగదని తెలిపారు. తద్వారా దోమల యొక్క ఉత్పత్తి తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలోఆరోగ్య విస్తరణాధికారిఅందెబాలచంద్రమౌళి, మలేరియాఆరోగ్యపర్యవేక్షకులు దీపాలశ్రీనివాసరావు,ఆరోగ్య కార్యకర్తలుషేక్ రషీద్,సయ్యద్ కరీముల్లా,మహిళాఆరోగ్య కార్యకర్త పాముల అన్నపూర్ణ,ఆశా కార్యకర్త బ బళ్ళసుధారాణి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో పోషకాహార దినోత్సవం



○ డిజిటల్ క్లాస్ ప్రారంభం

గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వసమగ్రవైద్యశాల గుంటూరులో 30వ వారం మీకోసం మేము కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బీవీ రావు, డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ, సీఎఎస్ ఆర్ఎంఓ, డైటీషియన్ గిరిధర్, డైటీషియన్ పీర్ సాహెబ్, డైటీషియన్ ఆకురతి లక్ష్మి, డాక్టర్ విద్య (ఎన్ఆర్సీ మెడికల్ ఆఫీసర్) పాల్గొన్నారు. ప్రజలకు అంతర్జాతీయ పోషకాహార దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా పేషెంట్లకు మొక్కలను బహుమతిగా అందజేశారు. జీజీహెచ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో రిటైర్డ్ ప్రిన్సిపల్ నాగ మల్లేశ్వ డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు డిజిటల్ క్లాస్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రథమంగా జీజీహెచ్ నర్సింగ్ స్కూల్‌లో ఈ డిజిటల్ క్లాస్ ప్రారంభమవడం ప్రత్యేకత. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మండలంలో విద్యుత్ అంతరాయం

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్) : మండల పరిధిలోని 33/11 కే వి. సబ్ స్టేషన్ల నందు నేడు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏడీఈ కుళాయప్ప ఏఈ రవిశంకర్ లు ఓ ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం పురస్కరించుకొని విద్యుత్ వినియోగదారులకు నాణ్య మైన విద్యుత్తును అందించడంలో భాగంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు బి.మఠం మల్లెపల్లె చౌదరివారిపల్లె డి అగ్రహారం సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు వ్యవసాయ దారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వారు తెలిపారు.

# దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రండి?

- ○ సోషల్ మీడియా వేదికగా చౌకబారు విమర్శలు చేస్తే తాట తీస్తాం
- ○ గత ప్రభుత్వంలో అభివృద్ధి అడిగితే శాపాలు పెట్టారు
- ○ మెడికల్ కాలేజీలపై జగన్ విషం కక్కుతున్న జగన్ ను ఛీ కొడుతున్నారు
- ○ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- ○ పాత గుంటూరులో రూ.1.42 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గత వైసీపీ ఎమ్మెల్యేను అభివృద్ధి అడిగితే శాపాలు పెట్టారని, ఇప్పుడు అడగకుండానే అభివృద్ధి పనులు చేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక పాత గుంటూరులో రూ. 1. 42 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఏడాది కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో రూ. 30 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వెల్లడించారు. పాత గుంటూరులో గత ప్రభుత్వంలో టీడీపీ కార్పొరేటర్ ను గెలిపించినందుకు ఐదేళ్లు ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి దూరం చేశారని తెలిపారు. వైసీపీ నాయకులు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని చౌకబారు విమర్శలు చేస్తే తాటతీస్తామని హెచ్చరించారు. దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలని, తాను ఎప్పుడైనా సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు నిర్ణయించిందని, ఎవరు నిర్మిస్తారో చూస్తామని జగన్ బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి నాయకులను జైల్లో ఉంచాలని ప్రజలకు కోరుకుంటున్నారని చెప్పారు. గుంటూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, గతంలో ఎన్నడూ లేని విధంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తాను ముందు నిలుస్తానని స్పష్టం చేశారు. రామాలయం వీధిలో రూ. 40. 50 లక్షలు, బ్రహ్మగిరి ఆలయ వీధి రూ. 41 లక్షలు, యాదవ బజారులో రూ. 9. 85 లక్షలు, గొలుసుకొండలరావు నగర్ రూ. 16 లక్షలు, నితుంజయ నగర్ రూ. 33. 50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ యల్లావుల అశోక్, డివిజన్ అధ్యక్షులు రియాజ్, బట్ట రాజా, గట్టు శ్రీకాంత్, అల్లం బాజీ, కాయల సాంబశివరావు, కొలగాని సుబ్బారావు, తాడిపోయిన శ్రీను, చెన్నం శెట్టి నరసింహ, దాసరి గౌతమ్, ఆరిఫ్, తలారి సాయిరాం, ఫణి, రుద్రా సాయి, ఆరాధ్యుల గోపి, దొడ్డక రాజేష్, దాసరి చంద్రకాంత్, పగడాల గోపి, ముద్దా సాయి, తిరుమల శెట్టి మోహన్ రావు, బాదినేటి మణికంఠ, పున్నయ్య, పసి, సాంబయ్య, మణికంఠ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నిధి భవన్ ఎదుట కాంట్రాక్టర్లు నిరసన



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):మంగళగిరి ఆటో నగర్లోని నిధి భవన్ ఎదుట కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల సమస్యలపై స్టేట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్(సబ్కా) ఆధ్వర్యంలో శుక్రవారం కాంట్రాక్టర్లు నిరసన తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 200 మంది కాంట్రాక్టర్లు నిరసనలో పాల్గొన్నారు. కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని వారు నినాదాలు చేశారు. అనంతరం నిధి భవన్ సీఈవో గౌతమ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ విజయ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్ల సమస్యలపై సీఈవో గౌతమ్ కు వినతి పత్రం అందజేసి తమ సమస్యలు వివరించగా సానుకూలంగా స్పందించి పరిశీలించారన్నారు. కాంట్రాక్టర్లు పది రోజులు వరకు మాత్రమే పోర్టల్స్ లో బిల్లులు ఎక్కుతాయని అపోహలో ఉన్నారని, అది నిజం కాదని 30 రోజుల వరకు పోర్టల్స్ లో బిల్లులు ఎక్కుతాయని సీఈవో చెప్పారని కాంట్రాక్టర్స్ ఆ విషయం గమనించాలన్నారు. సీడీఎంఏ కమిషనర్ కూడా నిధి భవన్ కి రావడంతో మున్సిపాలిటీలలో కాంట్రాక్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకు వెళ్ళగా సానుకూలంగా స్పందించారన్నారు. మున్సిపాలిటీలలో అధికారులు పీవో విధానం పాటించకుండా బిల్లులు అప్లోడ్ చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి కొండా రమేష్, కోశాధికారి అప్పారావు, గుంటూరు, కృష్ణా, వెస్ట్ గోదావరి, కాకినాడ జిల్లాల అసోసియేషన్ ల అధ్యక్షులు కే వెంకట్రావు, మండవ సాయి, రాంబాబు, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు నగరంలో డ్రైన్లపై ర్యాంప్‌ల తొలగింపు ఆదేశాలు



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో డ్రైన్లపై ఏర్పాటు చేసిన ర్యాంప్‌లను తక్షణం తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కమిషనర్ పట్నం బజార్, ఏలూరు బజార్ ప్రాంతాల్లో డ్రైన్లపై నిర్మించిన ర్యాంప్‌లను, శ్రీనివాసరావు తోటలో డ్రైన్లలో పేరుకున్న వ్యర్థాలను, పీకలవాగు పక్కన చెత్త డంపింగ్‌ను, చౌడవరంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

పట్నం బజార్, ఏలూరు బజార్లలో కొత్తగా నిర్మించిన డ్రైన్లపై ర్యాంప్‌లు వర్షపు నీరు వెళ్లడాన్ని అడ్డుకోవడంతో పాటు వ్యర్థాలు తొలగించడానికి అవరోధంగా ఉన్నాయని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జేసిబిలతో ర్యాంప్‌లను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.

శ్రీనివాసరావు తోటలో వర్షం వల్ల డ్రైన్లలో పేరుకున్న చెత్త తొలగించలేదని సచివాలయ శానిటేషన్ కార్యదర్శిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి, వెంటనే శుభ్రపరిచేలా ఆదేశించారు. పీకలవాగు వెంబడి చెత్తను డంప్ చేయడం పూర్తిగా నిషేధమని, ఇప్పటికే పేరుకున్న చెత్తను తొలగించాలంటూ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

తరువాత చౌడవరంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్, అక్కడి పారిశుద్ధ్యం, త్రాగునీరు వంటి మౌలిక వసతులు వారం రోజుల్లో కల్పించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, ఈఈ వేణు, డిఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# 15వరకు దాసకుటి ఆశ్రమంలో కుంకుమార్చనలు



తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) ఆంధ్ర వాల్మీకి వాసుదేవ స్వామి పరంపర పీఠం అంగలకుదురు దాసకుటి ఆశ్రమంలో 74 వ కుంకుమార్చన పూజలు అశేష భక్తజన సేవలతొ,విశేషంగా కొనసాగుతున్నాయి. మండలంలోని అంగలకుదురు గ్రామంలో వేంచేసియున్న ఆంధ్ర వాల్మీకి వాసుదాస స్వామి పరంపర పీఠము నందు, గత నెల 31వ తేదీ నుండి ప్రారంభమైన 74 వ మహా కుంకుమార్చన సేవలు ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. విశేష కుంకుమ అర్చనలు, యజ్ఞ క్రతువులతో కొనసాగుతున్న ఈ కార్యక్రమాలలో శుక్రవారం మహిళా భక్తులచే సామూహిక కుంకుమార్చన పూజలు విశేషంగా నిర్వహించారు. కార్యక్రమాల ప్రాధాన్యతను దాసుకుటి ఆశ్రమ షష్ఠమ పీఠాధిపతి సీతారామ దాస స్వామి మీడియాకు వివరించారు. శనివారం మోదమూడి అంగలకుదురు తెనాలి ప్రాంతాల భక్తులచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ, ఆదివారం శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రత పూజలు, సోమవారం పూర్ణాహుతి కార్యక్రంతో మహా కుంకుమార్చన పూజలు పరిసమాప్తమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విశేషంగా పాల్గొన్న మహిళ భక్తులకు కుంకుమార్చన అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆశ్రమ సభ్యులు కార్యక్రమానికి సహకరించారు.

# విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు - రూ.8.72 లక్షల అపరాధ రుసుము



పిడుగురాళ్ల , (జర్నలిస్ట్ ఫైల్): పల్నాడు సర్కిల్‌లో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సంయుక్తంగా శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. సింగయ్య వెల్లడించిన వివరాల ప్రకారం, 60 బృందాలుగా ఏర్పాటైన 60 మంది అధికారులు, 185 మంది సిబ్బంది మొత్తం 5478 సర్వీసులను తనిఖీ చేశారు.

ఈ తనిఖీల్లో మీటరు లేకుండా విద్యుత్ దొంగతనానికి పాల్పడిన ఒకరిపై రూ. 0. 05 లక్షలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమ విద్యుత్ వినియోగం చేసిన ఇద్దరిపై రూ. 0. 15 లక్షలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలో వాడిన 6 మందిపై రూ. 0. 40 లక్షలు, అనుమతించిన లోడుకు మించి వినియోగించిన 107 మందిపై రూ. 7. 97 లక్షలు, తక్కువ బిల్లు జారీ చేసిన ఒకరిపై రూ. 0. 15 లక్షలు విధించారు. మొత్తం రూ. 8. 72 లక్షల అపరాధ రుసుము వసూలు చేశారు.

వినియోగదారులందరూ మీటర్లకు సీలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని అధికారులు సూచించారు. సీలు లేకపోతే లేదా తుప్పు పట్టి ఊడిపోతే వెంటనే స్థానిక విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సీలు త్వరగా దెబ్బతినే అవకాశం ఉండడంతో తరచుగా పరిశీలన అవసరమని తెలిపారు. సీలను ఉద్దేశపూర్వకంగా తొలగించడం, గాట్లు పెట్టడం వంటి చర్యలు విద్యుత్ చౌర్యంగా పరిగణిస్తారని హెచ్చరించారు. భారత విద్యుత్ చట్టం 135వ సెక్షన్ ప్రకారం పనిచేయని మీటరు, వేరే మీటరు పెట్టడం, సీలు లేకపోవడం కూడా చౌర్యంగా పరిగణించబడుతుందని అధికారులు స్పష్టం చేశారు.

మొదటిసారి తప్పిదానికి కాంపౌండింగ్ పద్ధతిలో రుసుము వసూలు చేసి కేసు నుంచి విడిచిపెడతారు. రెండోసారి తప్పిదం జరిగితే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతారు. రుసుము చెల్లించని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తులను జప్తు చేస్తారు. మొదటి సారి మూడు రెట్లు, రెండోసారి ఆరు రెట్లు జరిమానా విధించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని పేర్కొంటూ, దీనిపై ఫిర్యాదులు పూర్తి వివరాలతో 9440812263, 8639741050 నంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని అధికారులు వివరించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

ఈ తనిఖీలలో డి.ఇ.ఈ నాగసురేష్ బాబు, డి.పి.ఇ. విభాగం డి.ఇ.ఈ లు రవికుమార్, మల్లికార్జున ప్రసాద్, శ్రీనివాసరావు, ఆపరేషన్ విభాగం ఏ.ఈ పోతురాజు, డి.పి.ఇ. ఏ.ఈ.ఈ లు కోటేశ్వరరావు, సతీష్ కుమార్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మన అందరివాడు మన లోకేష్



○ మాజీ సర్పంచ్ అన్నే

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):నేపాల్ పర్యటనకు వెళ్లి అక్కడ జరుగుతున్న అల్లర్లలో చిక్కుకున్న మంగళగిరికి చెందిన ఎనిమిది మంది రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ చొరవతో సురక్షితంగా పట్టణానికి చేరుకున్నారు. సురక్షితంగా చేరుకున్న స్థానిక హాస్పటల్ రోడ్లోని చింతక్రింది కేంద్రప్రసాద్, పద్మావతి దంపతులను శుక్రవారం పెదవడ్లపూడి మాజీ సర్పంచ్, టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్, టీడీపీ నాయకులు అన్నే నందకిషోర్ లు కలసి, వారిని పరామర్శించి చింతక్రింది దంపతులను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా జరిగిన సూపర్ సిక్స్, సూపర్ హిట్ కార్యక్రమానికి కూడా మంత్రి లోకేష్ వెళ్లకుండా 18 గంటలు కష్టపడి నేపాల్ ఖాట్మండు అల్లర్లలో చిక్కుకున్న రాష్ట్రానికి చెందిన వారిని తిరిగి వారి ఇళ్లకు చేరుకునే విధంగా చేసిన లోకేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. బాధితులు నేపాల్ లో పడిన బాధలను వింటుంటే మనసు చలించిపోతుందనారు. అధికారంలో లేనప్పుడు మన మంగళగిరి, మన లోకేష్ గా పేరుపొందిన లోకేష్, అధికారంలోకి వచ్చిన తర్వాత మన అందరివాడు, మన లోకేష్ అనే స్థాయికి పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్రా ఏడుకొండలు, అఫ్జల్, తుమ్మా సత్యనారాయణ, ఉద్దంటి అప్పారావు, చింతక్రింది సాంబశివరావు తదితరులు వారిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

## అమ్మదయతో అన్నదానసేవ... అవసరాన్ని గుర్తించి విద్యాసేవ



○ కాళీమాత ఆలయకమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్

తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) అన్నార్తుల ఆకలితీర్చడం ద్వారా అన్నం పరబ్రహ్మస్వరూపముగా కీర్తించబడుతుందని, అమ్మదయతొ అటువంటి అన్నదాన సేవతొపాటు విద్యాదాన సేవకు తగు ప్రాధాన్యం కల్పిస్తున్నామని కాళీమాత దేవస్థాన కమిటి చైర్మన్ గుమ్మడి రమేష్ పేర్కొన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్ లోని శివాజీచౌక్ సెంటర్ లొ, వేంచేసియున్న కాళీమాత ఆలయ కమిటీ,అన్నదాన సేవలను ప్రతినెల రెండవ శుక్రవారం విధిగా నిర్వహిస్తున్న క్రమంలో, ఈ శుక్రవారం అన్నదాన సేవలను ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ గుమ్మడి రమేష్ ప్రారంభించారు. అదేవిధంగా ఫిజియోధెరఫీ కోర్స్ చేయనున్న విద్యార్థి, గూళ్ళవరపు నరశింహస్వామికి, బుక్స్ కోసం, 11,వేలు ఆర్థిక సహాయాన్ని గుమ్మడిరమేష్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు కాళీమత ఆశీస్సులతొ అందరూ బాగుండాలన్న, మహాసంకల్పంతొ, చేపడుతున్న అన్నదాన సేవకు, దాతలు వారి వంతు సహకారం అందజేస్తున్నారని, తమ వంతుగా అన్నదాన సేవను ఆనవాయితీగా నిర్వహించడం,వందలాదిమంది అన్నార్తులు అన్నదాన సేవలో పాల్గొని, తమ సేవను ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. అవసరం గుర్తించి, విద్యార్థుల విద్యావికాసనికి తమ వంతు తోడ్పాటు కల్పిస్తున్నామని, అంతా అమ్మ దయని, అందరికి కాళీమాత ఆశీస్సులు లభించాలని అన్నారు. అన్నదాన సేవలొ, పార్వతమ్మ, యర్రా శ్రీనివాసరావు,నక్కా వెంకటేశ్వరరావు, కందేపి సీతారామయ్య, పులివర్తి సుధీర్ ఉమ్మలనేని తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జెఎమ్ జె కళాశాలలో నేత్రవైద్యశిబిరం



○ ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా నేత్రవైద్యశిబిరం

తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)ఎన్,ఎస్,ఎస్, యూనిట్ సౌజన్యంతో, శంకరకంటి హాస్పటల్ వారి అధ్వర్యంలొ జెఎమ్ జె మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన నేత్ర వైద్యశిబిరం సేవలను కళాశాల నిర్వాహకులు పర్యవేక్షించగా విద్యార్థినిలు వినియోగించుకున్నారు. స్థానిక జేఎమ్ జె మహిళాకళాశాల ప్రాంగణంలొ, ఎన్,ఎస్,ఎస్ యూనిట్, శంకరకంటి హాస్పటల్ సంయుక్త నిర్వాహణలొ, శుక్రవారం నిర్వహించిన, నేత్రవైద్యశిబిరం సేవలను 750మంది, విద్యార్థినులు, అద్యాపకులు వినియోగించుకున్నారు. శంకర కటి హాస్పిటల్ వైద్యులు డాక్టర్, స్వప్న, డాక్టర్ . బాష, డాక్టర్ ప్రసన్నకుమార్,కంటి పరీక్షలు నిర్వహించగా,సిబ్బంది పి. కుమారి, ఆర్. మాధురి, గంగాధర్, నాగబాబు సహకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. శాంత మాట్లాడుతు కంటి వైద్యశిబిరం నిర్వాహణా అవసరాన్ని వివరించారు. టివి లు, మొబైల్ వీక్షణం విపరీతం కావడంతొ, కంటి సమస్యలను, చిన్న వయస్సులొనే చూస్తున్నామని అన్నారు. కంటి పరీక్షల అనంతరం, సమస్య అధిగమించే సూచనలు చేశారు. అవసరమైన వారికి కళ్ళజోళ్ళు ఉచితంగా అందజేయనున్నట్లు ప్రొగ్రాం అధికారి దాసరి విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలొడాక్టర్ పి. చెన్నమ్మ, కళాశాల వైస్ ప్రిన్సి పాల్ రోజలీన, విద్యార్థినులు, అద్యాపక, అద్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# పెన్షనర్ల కార్పొరేషన్ ఏర్పాటుపై సీఎం ఆదేశాలు



○ ఆంధ్ర పెన్షనర్లు పార్టీ అధ్యక్షులు సుబ్బరాయన్ విజ్ఞప్తిపై స్పందించిన సీఎంఓ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో పెన్షనర్ల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సీఎంపీ నోట్ నం. 1270/Prl.Secy (MRC)/2025 గురువారం విడుదలైంది. ఆంధ్ర పెన్షనర్లు పార్టీ అధ్యక్షులు పి. సుబ్బరాయన్ ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సమర్పించిన విజ్ఞాపన పత్రంపై సీఎం సానుకూలంగా స్పందించారు. ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సుబ్బరాయన్ విజ్ఞప్తి చేశారు. నెల మొదటి తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లించే ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన అభినందించారు. ఈ నేపథ్యంలో సీఎం ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవి చంద్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాశారు. ప్రతిపాదనపై సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, నెలరోజుల్లో సీఎం కార్యాలయానికి నివేదిక అందజేయాలని ఆదేశించారు. అదేవిధంగా తీసుకున్న చర్యల వివరాలు పీజీఆర్ఎస్ ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. దీంతో రాష్ట్రంలో పెన్షనర్ల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు దిశగా అడుగులు వేయనుందన్న సంకేతాలు స్పష్టమవుతున్నాయి.

## ఆర్టీసీ బస్సు ప్రమాదంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవేదన



**అనంతపురం, (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలోని బెలుగుప్ప–నక్కలపల్లి మార్గంలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు బోల్తాపడిన ఘటనలో 10 మంది ప్రయాణికులు గాయపడటం బాధాకరమని పేర్కొన్నారు.
గాయపడిన వారికి మెరుగైన వైద్య సదుపాయాలు వెంటనే అందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 17 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపారు.
ఈ సందర్భంగా ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, గాయపడిన వారి చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదని స్పష్టంగా సూచించారు. అదేవిధంగా ప్రమాదానికి గల కారణాలను వెంటనే దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని రవాణా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
"ప్రజల ప్రాణ భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం" అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

## విద్యుత్ ఉద్యోగులు ఆందోళన బాటలోకి..



○ సమస్యల పరిష్కారం కోసం సీఎండీకి నోటీసు

**విశాఖపట్నం,(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించకుంటే దశలవారీగా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తూ సీఎండీ, ఏపీఈపీడీసీఎల్ ఇమ్మడి పృథ్వీ తేజ్‌కి ఆందోళన నోటీసును శుక్రవారం అందజేశారు.
ఉద్యోగులు డిమాండ్ చేసిన అంశాలలో 1999–2004 మధ్య ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జీపీఎఫ్ సౌకర్యం కల్పించడం, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు నిర్బంధంగా కారుణ్య నియామకాలు ఇవ్వడం, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి నేరుగా వేతనాలు చెల్లించడం, అన్ని క్యాడర్లలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, పెండింగ్ డీఏలను మంజూరు చేయడం ఉన్నాయి. ఈ సందర్భంగా డిస్కం జేఏసీ నాయకులు వి.ఎస్. ఆర్కే గణపతి, భూక్య నాగేశ్వరరావు, పోలాకి శ్రీనివాసరావు, తురగా రామకృష్ణ, జోగి నాయుడు, కేతా భాస్కర్, ఎస్. గోవిందు తదితరులు పాల్గొన్నారు.
ఉద్యోగులు సమర్పించిన సమస్యలపై సీఎండీ పృథ్వీ తేజ్ స్పందిస్తూ, డిమాండ్స్‌ను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారం సాధించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రైవేటీకరణ చేయనివ్వం

○ చంద్రబాబుకు ఎమ్మెల్సీ బొత్స హెచ్చరిక



**విశాఖ, (జర్నలిస్ట్ ఫైల్):** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం రాష్ట్రంలో మరోసారి సంచలనంగా మారింది. గతంలోనే స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం అడుగులు వేసింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తంకావడంతో ప్రైవేటీకరణ నుంచి వెనక్కి తగ్గింది. కానీ ప్లాంట్ నష్టాల్లో ఉందని, ఆర్థిక సాయం చేసింది. ఆ తర్వాత ప్లాంట్ ఉద్యమం అడుగున పడింది. కానీ ఇటీవల కాలంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాబోతోందనే ప్రచారం ఊపందుకుంది. దీంతో అధికార పార్టీ ఖండించింది. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గళం విప్పింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని ప్రకటించింది. విశాఖలో ఆందోళనలు నిర్వహించింది. స్టీల్ ప్లాంట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయనివ్వమని ఆ పార్టీ నేతలు హెచ్చరించారు. తాజాగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కూడా ఆదే మాట చెప్పారు. విశాఖ ఉక్కు పరిరక్షణే తమ ధ్యేయమని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయనివ్వమన్నారు. ప్రజా ఉద్యమంగా మారితేనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగుతుందని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయడం చంద్రబాబు నైజమని బొత్స సత్యనారాయణ విమర్శించారు.

# న్యూరాజరాజేశ్వరి పేటలో డయేరియా పరిస్థితి అదుపులో

○ మంత్రులు సత్యకుమార్, నారాయణ



**విజయవాడ( జర్నలిస్ట్ ఫైల్ )** విజయవాడ నగర పరిధిలోని న్యూరాజరాజేశ్వరి పేటలో ఇటీవల కలకలం రేపిన డయేరియా కేసుల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎంపి కేశినేని శివనాథ్ చిన్ని ఈరోజు పర్యటించారు. స్థానిక డయేరియా కేసుల తీవ్రత, బాధితుల పరిస్థితిను పరిశీలించి, ప్రజలతో సమావేశమయ్యారు.

**ప్రజల కోసం తక్షణ చర్యలు :**
141 మంది డయేరియాతో బాధితులుగా గుర్తించబడ్డారు. వీరిలో 68 మంది ప్రస్తుతం వైద్య చికిత్స పొందుతున్నారు. ఇతరులు కోలుకుని ఇళ్లకు చేరుకున్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మరియు మంత్రి నారాయణ స్పష్టంగా చెప్పినట్లు, డయేరియా కారణంగా ఎవరూ ప్రాణ నష్టం పొందలేదు. ఈ రకమైన వదంతులను ప్రజలు నమ్మవద్దని అధికారులు సూచించారు.
ప్రాంతంలోని ఇంటింటికి వెళ్లి ఓ.ఆర్.యస్ ప్యాకెట్లు, మందులు అందజేయడం, ప్రజల పరిస్థితిని గుర్తించడం వంటి చర్యలు తీసుకున్నారు. డయేరియా కారణాలపై అధికారులు పరిశీలనలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

**కాలుష్య నీటి సరఫరా పరిస్థితి:**
ప్రస్తుత కాలుష్య సమస్యల నేపథ్యంలో మంచినీటి పైపు లైన్, అండర్‌గ్రౌండ్ వాటర్ నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కి పంపించాం. రిపోర్ట్స్ ఇప్పటివరకు నెగటివ్ గా వచ్చాయి. తాత్కాలికంగా మంచినీటి సరఫరాను నిలిపివేసి, మినిరల్ వాటర్ క్యాన్ల ద్వారా నీరు అందిస్తున్నారు.
నగరంలో 13 లక్షల జనాభా, 3.16 లక్షల కుటుంబాలు నివసిస్తున్న నేపథ్యంలో, సరఫరా చేస్తున్న 38 ఎంజీడీ నీటిలో 30 శాతం లీకేజీల కారణంగా వృథా అవుతోంది. పాత పైపు లైన్లు, డ్రైనేజీ మరియు తాగునీటి పైపులు ఒకే చోట ఉండటం, మురుగునీరు కలిసిపోవడం ప్రధాన సమస్యగా గుర్తించబడింది.

**అధికారుల సమన్వయం :**
ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా, డిఎంహెచ్వో డాక్టర్ సుహాసిని, వైద్య శాఖ సిబ్బంది, వీఆర్ఎంసి కమీషనర్ ధ్యాన చంద్ర, డిహెచ్ డాక్టర్ పద్మావతి సంఘటితంగా పనిచేస్తున్నారు. 24 గంటల వారీగా సిబ్బంది అందుబాటులో ఉంచారు. 11 అత్యవసర ప్రభావిత వార్డుల్లో ప్రత్యేక అధికారులు నియమించబడ్డారు. తాగునీరు, ఆహారం, పారిశుద్ధ్యం, చిన్నారులు, వృద్ధులు, గర్భిణీ మహిళలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.
ప్రజలకు అవసరమైన సహాయం కోసం 9154970454 నంబరులో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది. మంత్రులు, అధికారులు వి.క్ర. మాట్లాడుతూ, డయేరియా కేసులు పెరిగినా ప్రాణనష్టం లేదు, వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా అన్ని విధమైన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

# వైద్య శిబిరంను పరిశీలించిన ఎంఎల్ఏ రామాంజనేయులు

○ సరైన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి
○ ప్రభుత్వం అండగా ఉంటుంది



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** తురకపాలెం గ్రామం లో నిర్వహిస్తున్న వైద్య శిభిరం ను శుక్రవారం నాడు స్థానిక శాసనసభ్యులు డా. బి.రామాంజనేయులు పర్యవేక్షించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా వర్షాలు అధికంగా పడ్డాయి. దీని ద్వారా బాక్టీరియా ప్రభళిందన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడంతో కొంత మందికి వ్యాధులు వచ్చాయన్నారు. నీరు వలన ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. పారిశుధ్యం సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని త్వరితగతిన సమస్యలను పరిష్కారం అయ్యేలా సంబంధిత అధికారులు ను ఆదేశించినట్లు తెలిపారు. ఆర్ ఎం పి లు మందుల డోస్ ఇచ్చే విషయం లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోతాదుకు మించి మందుల వినియోగం వలన పేషంట్ కు ఇబ్బంది కలుగుతుందన్నారు. ప్రజలు త్వరగా కోలుకోవాలని ప్రైవేట్ వైద్యులను సమోరాడిస్తున్నారని, ప్రభుత్వ వైద్య శాలలలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అనారోగ్య సమస్యలు ఉన్నవారు స్థానిక ప్రభుత్వ వైద్య సిబ్బంది నీ సంప్రదించాలని సూచించారు. నియోజకవర్గం లో ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అందరూ కూడా సరైన ఆరోగ్య రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దసరా మహోత్సవాలకు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడలో జరిగే శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ను అధికారికంగా ఆహ్వానించారు. వెలగపూడి ఏపీ సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో గురువారం మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను కలిసిన దేవస్థానం ఈఓ వి.కే. శీనా నాయక్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం పురోహితులు వేద మంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. మహోత్సవాల్లో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల వివరాలను ఈఓ మంత్రికి వివరించారు. ఆలయ మహోత్సవాలకు ప్రభుత్వం తరఫున తమ హాజరుతో గౌరవాన్ని చేకూర్చాలని మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను కోరారు.

## కూటమి ప్రభుత్వానికి ఆటో డ్రైవర్ల తరఫున ధన్యవాదాలు



○ ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్ల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్థిక సాయం ప్రకటించడం సంతోషకరమని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మిక, కర్షక ప్రభుత్వం కొనసాగుతోందని, కూటమి ప్రభుత్వం నిజమైన ఆటో డ్రైవర్ల ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల తరఫున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ హయాంలో ఆటో డ్రైవర్లకు 10 వేల రూపాయలు ఇస్తే, 20 వేల రూపాయలు లాక్కున్నారని ఆయన విమర్శించారు. ఆటో డ్రైవర్లు 10 వేలు పొందగానే పోలీసుల రూపంలో అధిక ఫైన్లు విధించి పీడించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం 1,400 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలో గుంతల రహదారులను బాగు చేసిందని వివరించారు. ఆటో డ్రైవర్లకు 15 వేల రూపాయలు ఇవ్వాలని చంద్రబాబు ప్రకటించగా, దీనిని జగన్ వ్యతిరేకిస్తున్నాడని మండిపడ్డారు. "సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. అలాగే అమ్మఒడి పథకం గతంలో ఒక బిడ్డకే వర్తించిందని, మిగతా పిల్లలకు అన్యాయం జరిగేదని, ఇప్పుడు "తల్లికి వందనం" పథకం పిల్లలందరికీ వర్తిస్తున్నదని వివరించారు. మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నామని, ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. పేదలకు ఉపయోగపడే పథకాలను జగన్ రాక్షసుడిలా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. అన్నదాతను ఆదుకునే చర్యలు చేపట్టి, నీటి సంఘాల ద్వారా కాలువల పునరుద్ధరణ జరిపి, అన్నదాత సుఖీభవ పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. "క్రమశిక్షణ, పట్టుదలతో నారా లోకేష్ ప్రజలకు సేవలందిస్తున్నారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారిని ముందుగానే స్పందించి రాష్ట్రానికి సురక్షితంగా తీసుకొచ్చారు. దేశం మొత్తం లోకేష్ సేవలను ప్రశంసిస్తోంది. పీ4 ద్వారా పేదరికం లేని సమాజ నిర్మాణానికి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. జగన్ ఫ్రస్ట్రేషన్‌లో పిచ్చివాడిలా మాట్లాడుతున్నాడని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# మంగళగిరికి క్షేమంగా చేరుకున్న 11 మంది నేపాల్ యాత్రికులు

○ నేపాల్ నుంచి తెలుగువారిని రక్షించడంలో మంత్రి నారా లోకేష్ పాత్ర అపూర్వం
○ తెలుగు ప్రజలను స్వస్థలాలకు చేర్చిన మంత్రి నారా లోకేష్‌కు అభినందనలు
○ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య



**మంగళగిరి టౌన్,(జర్నలిస్ట్ ఫైల్):** నేపాల్‌లో జరుగుతున్న అల్లర్ల కారణంగా చిక్కుకుపోయిన 215 మంది తెలుగు వారిని సురక్షితంగా స్వస్థలాలకు రప్పించడంలో మంత్రి నారా లోకేష్ పాత్ర అపూర్వమని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య కొనియాడారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ తెలుగు ప్రజలను స్వస్థలాలకు చేర్చిన మంత్రి నారా లోకేష్ కు అభినందనలు తెలిపారు. శుక్రవారం ఉదయం మంగళగిరి నియోజకవర్గంకు చెందిన 11 మంది యాత్రికులు క్షేమంగా చేరుకున్నారని అన్నారు. నేపాల్‌లో జరుగుతున్న మారణహోమం లో తెలుగువారు ఉన్నారని తెలిసిన వెంటనే మంత్రి లోకేష్ ఒక్కక్షణం ఆలస్యం చేయకుండా స్పందించి, అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని నేరుగా అమరావతిలోని సచివాలయానికి చేరుకున్నారని వివరించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్‌ను వార్ రూమ్ గా మార్చి సహాయక చర్యలను సమన్వయం చేసిన మంత్రి లోకేష్ బాధితులతో నేరుగా మాట్లాడి వారికి ధైర్యం చెప్పారని ఆయన తెలిపారు. ఎక్కడ చిక్కుకుపోయారో వారి లొకేషన్ కోఆర్డినేట్లు, మ్యాప్‌లు సిద్ధం చేయించి, ఢిల్లీలోని ఏపీ భవనంలో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడం, చిక్కుకున్న వారికి ఆహారం, నీరు, వసతి సదుపాయాలను కల్పించేలా కృషి చేశారని గుర్తుచేశారు. మంత్రి లోకేష్ కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ సుమారు 215 మంది తెలుగువారిని సురక్షితంగా రక్షించడంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎప్పుడైనా తెలుగువారికి అపద కలిగితే ముందుండి సాయం చేసే పార్టీ తెలుగుదేశం పార్టీ అని మరోసారి నిరూపించారన్నారు. జూన్ 2025లో కంబోడియాలో మోసపూరిత ఉద్యోగ ఆఫర్లకు బలైన తెలుగు యువకులను రక్షించడంలోనూ మంత్రి నారా లోకేష్ ముందుండి కృషి చేశారన్నారు. ఇప్పుడు నేపాల్‌లో చిక్కుకున్న వారిని రక్షించడంలోనూ అదే తపనతో ముందుకు వచ్చారన్నారు. కానీ ఈ సున్నితమైన సమయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నుంచి మాత్రం కనీస స్పందన కూడా రాలేదని, మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన సందర్భంలో నిర్లక్ష్యం ప్రదర్శించారని విమర్శించారు. గతంలో ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న వారిని, గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడిన వారిని స్వదేశానికి రప్పించడంలోనూ చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించారని, ఇప్పుడు అదే సంప్రదాయాన్ని మంత్రి లోకేష్ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. నేపాల్‌లో ఆపదలో చిక్కుకున్న ఒక్కో తెలుగు వ్యక్తిని సురక్షితంగా స్వదేశానికి చేర్చడంలో మంత్రి నారా లోకేష్ కృషి విశేషమని, ఈ ఘటనతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి మరోసారి భరోసా కలిగిందని తెలిపారు.

# 50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం : మంత్రి మనోహర్



**కాకినాడ:** 2025–26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్లో రాష్ట్రంలో రైతుల నుండి 50 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యం చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ హాలులో మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, విసి ఎండి మనజీర్ జిలాని సమూన్లతో కలిసి పూర్వ ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ డియంలు, డిఎస్ఓలు, వ్యవసాయ, రెవెన్యూ, సహకార, మార్కెటింగ్, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో ప్రాంతీయ సమావేశం నిర్వహించి 2025–26 ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రణాళికపై చర్చించి లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత యేడాది ఖరీఫ్ సీజను సేకరణలో తీసుకున్న మంచి ప్రణాళికలు చేపట్టామని రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్నికి 48 గంటలలోపే చెల్లింపులు చేపట్టామని చెప్పారు. గత ఖరీఫ్, రబీ సీజన్లలో 7.67 లక్షల మంది రైతుల నుండి 12,557 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయడమే కాక గత ప్రభుత్వం రైతులకు బకాయిపెట్టి వెళ్లిన 1674 కోట్ల మొత్తాన్ని కూడా కూటమి ప్రభుత్వం రైతులకు చెల్లించిందన్నారు. 2025–26 ఖరీఫ్ ధాన్యం సేకరణలో గోనె సంచులు, రవాణా వాహనాల పరంగా ఇబ్బందులు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు కార్యాచరణతో సంసిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటలు ముందే అక్టోబరు రెండవ వారానికే కోతకు వస్తున్నందున అన్ని జిల్లాలో ధాన్యం మార్కెట్కు వచ్చేందుకు నాలుగైదు రోజుల ముందే సేకరణ కేంద్రాలను ప్రారంభించాలని, ఇందుకు సిబ్బందికి అవసరమైన పిపిసి కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలను సెప్టెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని 1234 రైతు సేవా కేంద్రాలను, 691 రైసు మిల్లులను అనుసంధానం చేసి సేకరణ ప్రక్రియను రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు సమాయత్తం కావాలన్నారు. గత ఖరీఫ్ సీజనలో రాష్ట్రంలో 35.94 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ చేసామని, అధిక దిగుబడుల అంచనా, కేంద్రం జారీచేసిన అదనపు కేటాయింపులతో 2025–26 ఖరీఫ్ సీజనులో రాష్ట్ర చరిత్రలో తొలి సారి అత్యధికంగా 50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించేందుకు లక్ష్యంను చేపట్టామన్నారు. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరి జిల్లాలో 5 లక్షలు, బిఆర్ఏ కోనసీమ జిల్లాలో 3.50 లక్షలు, కాకినాడ జిల్లాలో 3 లక్షలు, ఏలూరు జిల్లాలో 4 లక్షలు వెరసి 19.50 లక్షల మెట్రిక్ టన్నులు ఉమ్మడి గోదావరి జిల్లాలోనే సేకరణ జరగనుందని తెలిపారు.
అలాగే కేంద్ర ప్రభుత్వం వరి సాధారణ రకాలకు 2369 రూపాయలు, ఏ గ్రేడ్ రకాలకు 2389 రూపాయలకు పెంచి మద్దతు ధరలను ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో రైతులను నుండి కొనుగోలు చేసిన ఫైన్ రకాల ధాన్యాన్ని 41 వేల పాఠశాలలు, 4 వేల సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల భోజన పథకానికి బియ్యంగా సరఫరా చేస్తున్నామని, ఈ ఖరీఫ్ సీజనులో రైతుల నుండి ఫైన్ రకాల ధాన్యం సేకరకణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి మిల్లర్ల నుండి బ్యాంకు గ్యారెంటీలను ఆన్లైన్ ద్వారా సేకరించాలని మంత్రి తెలిపారు.
సమావేశంలో తొలుత పౌర సరఫరాల సంస్థ విసి ఎండి మనజీర్ జిలాని సమూన్ ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత సమర్ధవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంస్థ రూపొందించిన ప్రొక్యూర్మెంట్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆన్లైన్ పోర్టల్ గురించి అధికారులకు వివరించారు. ఈ పోర్టల్లో రైతు సేవా కేంద్రాలు, సిబ్బంది, కొనుగోళ్ల చెల్లింపులు వాహనాలు వెబ్బ్రిడ్జిలు మాయిశ్చర్ మీటర్లు, గోనెసంచులూ మిల్లులు ఫీడ్ బ్యాక్ తదితర సమాచారాన్ని పొందుపరచాలని అధికారులకు సూచించారు.
ఈ సమావేశంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, తూర్పు గోదావరి జిల్లా డియం గణేశ్ కుమార్, ఏలూరు జిల్లా డియం పిఎస్ఆర్ మూర్తి ఆయా జిల్లాలలో 2025–26 ఖరీఫ్ ధాన్యం సేకరణకు చేపట్టిన చర్యలను మంత్రి నాదెండ్లకి వివరించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467